

ఏఎస్‌పేట : శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

ముందస్తు సంబరం

జిల్లావ్యాప్తంగా కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు.



నాణెం అబ్బే.. వద్దులేండి!

అబ్బే.. ఆ కాయిన్ వద్దులేండి. మీరిచ్చినా మార్చుకునేందుకు మా వల్ల కాదు.. ఉంటే నోటు ఇవ్వండి. లేదా ఫోన్‌పే చేయండి.' అంటూ వ్యాపారులు తెగేసి చెబుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లోనూ ఇదే పరిస్థితి. ఆర్బీఐ నిబంధనల ప్రకారం మీరు తీసుకోవాలి కదా! అని ప్రశ్నిస్తే అవన్నీ మాకు తెలియదు సార్.. కాయిన్ తీసుకుని మేం ఇబ్బంది పడలేం. అర్థం చేసుకోండి' ఇలా ఖరాకండీగా చెప్పేస్తున్నారు.

- రూ.10 నోట్ల కొరత.. నాణేలే దిక్కు!
- అయినా తీసుకోని వ్యాపారులు
- ఆర్టీసీ బస్సుల్లోనూ అంతే!
- ఆర్బీఐ సూచనల బేఖాతరు

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 24 : జిల్లాలో పది రూపాయల నోట్లకు కొరత ఏర్పడింది. ఇందుకూ ప్రత్యామ్నాయమైన రూ.10 నాణేన్ని చెలామని చేద్దామన్నా కొంతమంది వ్యాపారులు తీసుకునేందుకు ససేమీరా అంటున్నారు. 2019లో ఆర్బీఐ ప్రవేశపెట్టిన రూ.10 నాణేన్ని స్టాండర్డ్ డిజైన్‌లతో నాలుగు రకాలుగా రూపొందించారు. పది రూపాయల నోటు ఎక్కువ కాలం నాణ్యత, మన్నికగా ఉండదు. దీంతో సుమారు 20 ఏళ్లపాటు చెలామణిలో మన్నికగా ఉండేలా ఆర్బీఐ రూ.10 నాణెంను అందుబాటులోకి తెచ్చింది. రూపాయి, 2, 5 రూపాయల నాణేల తరువాత రూ. 10 నాణెం విలువైంది. ఇప్పటికి ఐదేళ్లగా దేశవ్యాప్తంగా చెలామణిలో ఉన్నా మన జిల్లాలో మాత్రం అందుబాటులో లేదు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడులోని చెన్నై మహానగరంలో ఆ నాణెం చెల్లుబాటులో ఉంది. ఆ రాష్ట్ర ఆర్టీసీ బస్సులు, వ్యాపార సముదాయాల్లో విరివిగా వినియోగిస్తున్నారు. అక్కడ వినియోగంలో ఉన్న నాణేన్ని నెల్లూరులో ఎందుకు తిరస్కరిస్తున్నారో అర్థం కాని పరిస్థితి.

● తీసుకోకుంటే కేసే!

పది నాణెం చెలామణిలో ఉందని, అన్ని చోట్ల అది చెల్లు బాటువుతుందని ఇటీవల రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఎల్‌డీఎంలకు, ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించింది. వాణిజ్య సముదాయాల్లో నాణేన్ని తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తారు.

● ప్రచారం లోపం

రూ.10 నాణెం చెలామణిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఈ బాధ్యత బ్యాంకర్లదే. జిల్లాలో వందలాది బ్యాంకులు ఉండగా, వాటి పరిధిలో వేలాది మంది ఖాతాదారులు ఉన్నారు. ఖాతాదారుల సమావేశం, బ్యాంకులతో వ్యాపార సంబంధాలు నెరిపే వ్యాపారులతోనూ రూ.10 నాణెం విషయం బ్యాంకర్లు ప్రస్తావించడం లేదనేది సమాచారం. బ్యాంకర్లు బాధ్యతగా తీసుకుని రూ.10 నాణెంపై ప్రచారం నిర్వహిస్తే వాటి చెలామణి పెరుగుతుంది. జీఎస్టీ అధికారులు కూడా వ్యాపారులతో సత్సంబంధాలు కలిగి ఉంటారు. వారు కూడా వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

రూ. 10 నాణెం ఎక్కడైనా చెల్లుతుంది



రూ.10 నాణెం తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాలలో చెలామణిలో ఉంది. ఆంధ్రప్రదేశలో ముఖ్యంగా నెల్లూరులో ఎందుకో చెలామనిలో లేదు. బ్యాంకులలో వాటిని మార్చుకోవచ్చు. డిపాజిట్ చేయవచ్చు. ఈ నాణేన్ని తిరస్కరించే బ్యాంకర్లపై ఫిర్యాదు చేయవచ్చు. వ్యాపారులు, ఇతరులకు ఈ నాణెంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

- శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, ఎల్‌డీఎం

'ఉపాధి' భోక్తలపై వేటు

12 మంది సిబ్బంది సస్పెన్షన్ ● రూ.61లక్షల రికవరీకి ఆదేశాలు

కలువాయి, ఆగస్టు 24 : గత వైసీపీ పాలనలో కలువాయి మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో కనీవినీ ఎరుగని రీతిలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందుకు బాధ్యులైన 12 మంది సిబ్బందిని సస్పెండ్ చేస్తూ డ్వామా కార్యాలయం నుంచి ఎంపీడీవో కార్యాలయానికి శనివారం ఉత్తర్వులు అందాయి. ఇంజనీరింగ్ కన్సల్టెంట్ (ఈసీ) జే.శీనయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏ) ఆర్.ప్రసూన, ఎం.వెంకటేశ్వర్లు, ఎంవీ.ప్రసాద్, క్షేత్రసహాయకులు (ఎఫ్ఏ) రవీంద్ర (చీపినాపి), వేమనారాయణ (పర్లకొండ), నరసయ్య (ఉయ్యాలపల్లి), ఎస్‌కే.మస్తాన్ (చింతలపాళెం), ప్రతిమ (బాలాజీరావుపేట), మహేంద్ర (చిన్నగోపవరం), సుమన్ (బ్రాహ్మణపల్లి), హరి (కనుపూరుపల్లి మేట్)లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంతేగాక వారి నుంచి రూ.61లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే రికార్డులు, సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకోవాలని ఏపీవోను ఆదేశాలు వెలువడ్డాయి. ఒక్కసారిగా 12 మంది సిబ్బంది సస్పెండ్ కావడం కలువాయి మండలంలో చర్చనీయాంశంగా మారింది. 2023-2024లో జరిగిన సుమారు రూ.11కోట్ల ఉపాధి పనులపై ఇటీవల 16వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో రూ.2.89 కోట్లు అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందాలు గుర్తించి ప్రజావేదికలో ప్రిసైడింగ్ అధికారి దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై ఉపాధి సిబ్బందిని విచారించిన అధికారులు రూ.61 లక్షలు రికవరీకి ఆదేశించడంతో పాటు ఇందుకు బాధ్యులపై వేటు వేశారు.

● చిన్నగోపవరంలోనూ..

చిన్నగోపవరంలోనూ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరుల జాబ్‌కార్డులలో ఇతర ప్రాంతాలకు చెందిన 148 మంది పేర్లు పేర్లు ఎక్కించి వారందరూ ఉపాధి పనులకు వెళుతున్నట్లు బోగస్ మస్టర్లు వేసి నిధులు స్వాహా చేశారు. ఈ మేరకు ఎఫ్ఏ మహేంద్ర నుంచి రూ.27.45 లక్షలు రికవరీ చేయాలని ఆదేశించారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (విద్య) : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం (సెప్టంబరు 5వతేదీ) సందర్భంగా జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ నెల 31వ తేదీ లోపు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈఓ, డిప్యూటీ ఈఓల ద్వారా దరఖాస్తులను జిల్లా కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు. నేరుగా పంపిన దరఖాస్తులు స్వీకరించబడవన్నారు.


వైసీపీ టీచర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పర్వతరెడ్డి

వైసీపీ ప్రభుత్వ టీచర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నియమించారు. తనపై ఉన్న నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని ఈ సందర్భంగా పర్వతరెడ్డి పేర్కొన్నారు.



గంజాయి.. సై..రన్!

అర్ధరాత్రి ముఠా కోసం పోలీసుల చేజింగ్



- నెల్లూరు రూరల్ డీఎస్పీపైకి దూసుకెళ్లిన కారు
- నెల్లూరు, తిరుపతి పోలీసుల అప్రమత్తం
- గూడూరు మీదుగా కడప జిల్లాలోకి వెళ్లే ప్రయత్నం
- అడుగడుగునా వెంబడించిన పోలీసులు
- చేజింగ్‌లో కాలువలోకి దూసుకెళ్లిన సీఐ వాహనం
- కోనసముద్రం దాటాక ఆగిన చేజింగ్
- రోడ్డు లేకపోవడంతో పొలాల్లో ఆగిన కారు
- డ్రైవర్ అరెస్ట్.. మరో ఇద్దరు ఏమయ్యారు?
- పూర్తిస్థాయిలో విచారిస్తున్న పోలీసులు

ఎర్రచందనం దుంగలు, గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాలను పట్టుకునేందుకు పోలీసు వాహనాలు రయ్.. రయ్... మంటూ దూసుకుపోయే దృశ్యాలు సినిమాల్లోనే చూస్తుంటాం. సాహసోపేత చేజింగ్‌లు చేసి చివరకు దొంగలను పట్టుకుంటారు. అలాంటి సీన్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సాగింది. ఓ గంజాయి ముఠాను పట్టుకునేందుకు నెల్లూరు, తిరుపతి జిల్లాల పోలీసులు రాత్రంతా కంటిమీద కునుకులేకుండా కష్టపడ్డారు. చివరకు కారుతోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ చేజింగ్‌లో డీఎస్పీ గాయాలపాలవగా, ఇద్దరు సీఐలకు త్రుటిలో ప్రమాదం తప్పింది.

● అసలేం జరిగిందంటే..

విశాఖ నుంచి చెన్నైకు ఓ వాహనంలో భారీగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం శుక్రవారం రాత్రి నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌రావుకు అందింది. వెంటనే ఆయన కోవూరు పోలీసులను అప్రమత్తం చేశారు. ఈలోపు ఏపీ39డీజే1000 నెంబరు గల తెలుపురంగు కారు వేగంగా లారీల మధ్యలో దూసుకెళ్లింది. ఈ విషయాన్ని పోలీసు అధికారులకు తెలియజేశారు.

● అర్ధరాత్రి 1.30 గంటలకు..

వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద అర్ధరాత్రి రూరల్ డీఎస్పీ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. సరిగ్గా 1.30 గంటల ప్రాంతంలో కోవూరు పోలీసులు తెలిపిన నెంబరు గల కారు అక్కడకు రావడంతో ఆపారు. డ్రైవర్ పక్కగా నిలపగా తనిఖీ చేసేందుకు డీఎస్పీ వెళ్లారు. అంతే.. ఒక్కసారి కారు వాయువేగంతో ముందుకు దూసుకెళ్లింది. దీంతో డీఎస్పీ కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందజేసి, అప్రమత్తం చేశారు. తిరుపతి జిల్లా పోలీసులకూ సమాచారం ఇచ్చారు. గాయపడిన డీఎస్పీని నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

● 3 గంటలు హైటెన్షన్

వెంకటాచలం టోల్‌ప్లాజా నుంచి దూసుకెళ్లిన కారు తెల్లవారుజామున 4.20 గంటల వరకు అంటే 3 గంటల పాటు పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. వెంకటాచలం దాటిన తర్వాత బూదనం టోల్‌ప్లాజా వద్దకు కారు వస్తుందని తిరుపతి జిల్లా పోలీసులు అక్కడ కాపు కాశారు. అయితే అనూహ్యంగా గూడూరు పట్టణంలోకి వెళ్లి పాత బస్టాండు వద్ద విధుల్లో ఉన్న వాకాడు ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా, పోలీసులపైకి దూసుకెళ్లింది. రెప్పపాటులో వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అక్కడ నుంచి పొదలకూరు మీదుగా చేజర్ల, కలువాయి, అప్పారావుపాలెం, ఆత్మకూరు మీదుగా కడప వెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు.

● పొలాల్లోకి వెళ్లి దొరికిపోయి..

జిల్లావ్యాప్తంగా అప్రమత్తమైన పోలీసులు ప్రతి కూడలిలో తనిఖీలు ముమ్మరం చేశారు. నెల్లూరు-ముంబయి రహదారిలోని మర్రిపాడు మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద కాపుకాశారు. టోల్‌ప్లాజా ముందు కోన సముద్రం గ్రామం వైపు తెల్లవారు జామున 4.20 గంటలకు తెలుపు రంగు కారు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మకూరు సీఐ గంగాధర్ తన సిబ్బందితో కారును వెంటాడారు. అయితే, కోనసముద్రం సమీపంలో మలుపు వద్ద కల్వర్టుపై సిమెంట్ దిమ్మెను సీఐ కారును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లింది. అయితే వెనుకే వస్తున్న మరో పోలీసు వాహనం కారును వెంటాడింది. కోనసముద్రం గ్రామం దాటాక పొలాలు మాత్రమే ఉండటంతో రోడ్డు లేక కారు అక్కడే ఆగిపోయింది. వెంటనే పోలీసులు కారుతోపాటు డ్రైవర్ సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ రాజమహేంద్రవరం సమీపంలోని రాజానగరం వాసిగా పోలీసులు గుర్తించారు.



కల్వర్టును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లిన ఆత్మకూరు సీఐ వాహనం

● గంజాయి ఏమైంది!?

వెంకటాచలం వద్ద కారులో డ్రైవర్‌తోపాటు ముగ్గురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే, డ్రైవర్ మాత్రమే పట్టుబడటంతో మిగిలిన ఇద్దరు ఏమయ్యారని పోలీసులు ఆరా తీస్తున్నారు. అంతేగాక కారు రవాణా చేస్తున్న గంజాయి ఎక్కడ డంప్ చేసి ఉంటారని విచారిస్తున్నారు. ఏదిఏమైనా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు టెన్షన్ పెట్టిన కారు చివరకు దొరకడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు నిందితులు, దాచిన గంజాయిని వెలికితీసే పనిలో పడ్డారు.

- నెల్లూరు (క్రైం)/ వెంకటాచలం/ మర్రిపాడు



భక్తుల నడుమ సాగుతున్న వెంకయ్యస్వామి రథం

ఓం నారాయణ.. ఆదినారాయణ

- వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం
- ఉత్సాహంగా రథోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన గొలగమూడి

వెంకటాచలం, ఆగస్టు 24 : 'ఓం నారాయణ.. ఆదినారాయణ' భక్తుల నామస్మరణతో గొలగమూడి క్షేత్రం మారుమోగిపోయింది. ఇక్కడ జరుగుతున్న ఆరాధనోత్సవాల్లో చివరిరోజు శనివారం తరలివచ్చిన భక్తజనంతో గొలగమూడి కిక్కిరిసిపోయింది. స్వామివారి సమాధి మందిరాన్ని దర్శించుకోవడానికి భక్తులు గంటల కొద్దీ క్యూలో నిలబడ్డారు. భక్తుల కోసం ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో మంచినీరు, మరుగుదొడ్లు వంటి వసతులతోపాటు వైద్యశిబిరాలు కల్పించారు. కాగా, ఉదయం 9 గంటలకు స్వామివారికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆశ్రమ ఈవో సోమిరెడ్డి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆ తర్వాత పది గంటలకు వెంకయ్యస్వామి రథాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి ముందుకు లాగి ప్రారంభించారు. రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. రథంపై ఆశీనులైన స్వామివారు గ్రామ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రథం చుట్టూ పోలీసులు ప్రత్యేక వలయాన్ని ఏర్పాటు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ వెంకయ్య స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ పాలక మండలిసభ్యులు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● కనుల పండువగా తెప్పోత్సవం

కాగా, రాత్రి ఆశ్రమం పక్కన ఉన్న కోనేరు రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన తెప్పపై వెంకయ్య స్వామివారిని ఆశీనులను చేశారు. తరలివచ్చిన భక్తుల నడుమ కోనేరులో వెంకయ్యస్వామి విహరించారు. ఈ సందర్భంగా సంస్కృతిక, నాటక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.



తెప్పపై విహరిస్తున్న వెంకయ్యస్వామి



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి దంపతులు

చూపునిద్దాం లోకాన్ని చూపిద్దాం!

- నేత్ర దృష్టికి నోచుకోని అభాగ్యులెందరో
- దాతలతోనే వారికి కొత్త జీవితం
- మూఢ నమ్మకాలను వీడితే మరో జన్మ
- జిల్లాలో 91 వేల మంది నేత్రదాతలు
- స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయం
- నేటి నుంచి నేత్రదాన పక్షోత్సవాలు

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు. శరీరం ఎంత ఆరోగ్యంగా ఉన్నా, ఎంతటి ధనవంతులైనా కళ్లు లేకపోతే జీవితం అంధకారమే. నేత్ర దృష్టి లేనివారు చుట్టూ ఉన్న లోకాన్ని చూడలేకపోవడమే కాదు వ్యక్తిగత పనులను కూడా తమకు తాము ధైర్యంగా చేసుకోలేని పరిస్థితి నెలకొంటుంది. అటువంటి వారికి కంటి చూపు కొత్త జీవితాన్నిస్తుంది. అయితే అంధులకు ఆ భాగ్యం దక్కాలంటే దాతల వల్లే సాధ్యమవుతుంది. మరణానంతరం ఒకరి నేత్రాలు ఇద్దరి జీవితాల్లో వెలుగునిస్తాయి. అంతేకాదు భౌతికంగా శరీరం లేకపోయినా మరొకరికి నేత్రాలు ప్రసాదించడం ద్వారా మరో జన్మను పొందినట్లవుతుంది. ఇప్పటికే జిల్లాలో కొందరు స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకు వస్తున్నప్పటికీ మూఢనమ్మకాలను వీడి మరింతమంది దాతలుగా మారాల్సిన అవసరం ఉంది.

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 24 : శరీరంలో నేత్రాలకు ఉన్న ప్రాధాన్యత మరే అవయవాలకు లేదంటే అతిశయోక్తి కాదు. అయితే కొందరు పుట్టుకతో, మరికొందరు జన్యుపరమైన లోపాలు, వివిధ రకాల వ్యాధులు, ప్రమాదాల వల్ల కంటి చూపును కోల్పోతున్నారు. దేశ వ్యాప్తంగా 11 లక్షల మంది అంధులు ఉండగా, ఏటా మరో 1.25 లక్షల మంది ఆ జాబితాలో చేరుతుండటం ఆందోళన కలిగించే అంశం. గతంలో 40 ఏళ్ల పైబడ్డ వారు కార్నియా వ్యాధితో అంధులు అవుతుండగా, ప్రస్తుతం చిన్న పిల్లలను సైతం కార్నియా సమస్య వెంటాడుతోంది. కంటిపై గాయాలు, ఇన్ఫెక్షన్, పౌష్టికాహార లోపం వల్ల నల్లగుడ్డు మసకబారి కంటి చూపు గణనీయంగా తగ్గిపోతోంది. ఆఖరికి చూపు కోల్పోతారు. వీరికి తప్పనిసరిగా నల్లగుడ్డు మార్పిడి చేయాల్సి ఉంటుం ది. ఇలాంటి వారికి నేత్రదానం ద్వారా మరలా వెలుగును ప్రసాదించవచ్చును. ఈ క్రమంలో నేత్రదాన ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉంది. అయితే సామాజిక అవసరానికి తగినంతగా నేత్రదాతలు ముందు కు రావటం లేదు. 20 శాతం మాత్రమే నేత్రాల సేకరణ జరుగుతుండడంతో ఎదురుచూసే వారి సంఖ్య ఏడాదికే డాదికి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు జాతీయ స్థాయిలో ప్రభుత్వం నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తోంది.



జిల్లా వ్యాప్తంగా సేకరించిన నేత్రాలు

సంవత్సరం	సేకరించిన నేత్రాలు
2021-22	36
2022-23	392
2023-24	233
2024-25 (ఇప్పటి వరకు)	52

జిల్లాలో ఎందరో నేత్ర దాతలు

జిల్లాలో 2006వ సంవత్సరంలో నేత్రదానం ప్రారంభం కాగా, ఇప్పటి వరకు 2209 మంది దాతలు 4318 నేత్రాలను దానం చేశారు. ఏటా 400 నుంచి 450 మంది వరకు నేత్రదానం చేస్తున్నారు. అయితే కరోనా మహమ్మారి కారణంగా గత రెండేళ్లలో ఆ సంఖ్య 60కి పడిపోయింది. ప్రస్తుతం మళ్లీ నేత్ర దాతల సంఖ్య మెరుగుపడుతోంది. సుమారు 91 వేల మంది వారి మరణానంతరం నేత్రదానం చేస్తామని వివిధ సంస్థలకు రాతపూర్వకంగా తెలియజేసి ఉన్నారు. వీరిలో యువకులు, విద్యార్థులు కూడాపెద్ద సంఖ్యలో ఉండటం గమనార్హం. అయితే ఈ సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉంది. ఒక ఉద్యమంలా నేత్రదానం కొనసాగితే గానీ నేత్ర అవసరాలు తీర్చలేమని నిపుణులు చెబుతున్నారు. నేత్ర దానం చేస్తే నరకానికి పోతారన్న అపోహ, మూఢనమ్మకాలు చాలా మందిలో ఉన్నాయి. వాటిని పోగొట్టి నేత్రదానం వైపు నడిపించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక వేత్తలు విశేషంగా కృషి చేస్తున్నారు.

కాగా, గతంలో నేత్రాల సేకరణలో కనుగుడ్డు తీసేవారు. అయితే ప్రస్తుతం ఆధునిక విధానంలో కేవలం కంటి లోపల ఉన్న కార్నియా (నల్లగుడ్డు) పొరను మాత్రమే సేకరిస్తున్నారు. దీనివల్ల కంటి ప్రాంతంలో గుంట పడడం, ఇతరత్రా సమస్యలు రాకుండా చూస్తున్నారు. పరిశీలనగా చూస్తే తప్ప నేత్రదానం చేసిన ఆనవాలు కూడా కనిపించ కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ప్రజల్లో అవగాహన దిశగా..

నేత్రదానంపై జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుంచి ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వం తరపున జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఈ కార్యక్రమం చేపడుతోంది. జిల్లాలోని పలు ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. 15 రోజులపాటు ఈ చైతన్య కార్యక్రమాలు కొనసాగుతాయి.



ఎన్నో సంస్థల కృషి

నేత్రాల సేకరణకు ఎన్నో సేవా సంస్థలు కృషి చేస్తున్నాయి. నెల్లూరు నగరంలోని వాసవీ సేవాదళ్, చిరంజీవి యువత, వాసవీ క్లబ్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, జేసీసీ క్లబ్, బీ పాజిటివ్ సుబ్బారావు సంస్థల తోపాటు కోవూరుకు చెందిన సుభాష్ సేవా సంస్థ, విడవలూరుకు చెందిన మనసేలా సంస్థలు నేత్రాల సేకరణలో పాలుపంచుకుంటున్నాయి. నేత్రదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకు రావడానికి కృషి చేస్తున్నాయి. నెల్లూరు నగరానికి చెందిన మోడరన్ ఆసుపత్రి నేత్రాల సేకరణలో పలు స్వచ్ఛంద సంస్థలకు సహకారం అందిస్తోంది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ కూడా నేత్రాలను సేకరిస్తోంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దాతలను ప్రోత్సహిస్తున్నాం నేత్రదాన మోటివేటర్ల సంఖ్య పెంచేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. అందుకు అనుగుణంగా విస్తృత ప్రచారం నిర్వహి స్తోంది. ప్రజలు మరింత చైతన్యవంతం కావాల్సి ఉంది. ప్రస్తుత నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాము. ముఖ్యంగా విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేలా కృషిచేస్తున్నాము.

- డాక్టర్ శార్వాణి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ మేనేజర్

నేత్రదానం ఇలా చేయాలి..

- కుటుంబ సభ్యుల సమ్మతితో మరణానంతరం నేత్రదానం చేయాల్సి ఉంటుంది.
- మరణించిన ఆరు నుంచి 8 గంటల్లోపే కళ్లను దానం చేయాలి.
- వయస్సు, లింగ బేధం, రక్తం గ్రూపు, మతంతో సంబంధం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చు
- శుక్ల వ్యాధి ఉన్న వాళ్ల కళ్లను కూడా దానం చేయవచ్చు.
- రక్తపోటు, మధుమేహంతో బాధపడుతున్న వారైనా నేత్రాలను దానం చేయవచ్చు.

కుటుంబ సభ్యులను ఒప్పిస్తున్నాం



2009లో నేత్రదాన ఉద్యమం ప్రారంభించాం. ఇప్పటి వరకు 400 నేత్రాలను సేకరించాం. కేవలం సేవా భావంతో ఈ కార్యక్రమం చేపడుతున్నాం. లయన్స్ క్లబ్, వాసవి సేవాక్లబ్ తదితర సంస్థల సహకారం ఎంతో ఉంది. అయితే నేత్రాల సేకరణలో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మృతి చెందిన వారి వివరాలు తెలుసుకుని నేత్రదానానికి కుటుంబ సభ్యులను ఒప్పించేలా కృషి చేస్తున్నాం.

- బయ్యా ప్రసాద్, నేత్రదాన మోటివేటర్

మిల్లర్లకు బకాయిలు చెల్లించాలి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 24 : మిల్లింగ్ పరిశ్రమ ద్వారా ప్రభుత్వానికి సీఎంఆర్ విధానంలో అందించిన సేవలకుగాను ధాన్యం మిల్లుల యజమానులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని ది నెల్లూరు రైస్ మిల్లర్స్ అండ్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి ఓ ప్రకటనలో ముఖ్యమంత్రిని, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిని కోరారు. 2017-18, 2022-23 సంవత్సరాలకు సంబంధించి రూ.60 కోట్లను మిల్లర్లకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. 2011-12 సంవత్సరానికి సంబంధించి కూడా మిల్లర్లకు సుమారు రూ.2.50 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. రైతులకు, ధాన్యం మిల్లర్లకు ప్రథమ ప్రాధాన్యమిచ్చి బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

జీజీహెచ్‌లో అనుమానస్పద మృతి

- పురుగులు పట్టిన మృతదేహం
- మూడు రోజుల క్రితమే మరణించినట్లు ఆనవాళ్లు
- ఆసుపత్రి రోగి కాదంటున్న వైద్యసిబ్బంది



మృతదేహన్ని పరిశీలిస్తున్న పోలీసు



ఆసుపత్రి మిద్దెపై ఉన్న కిటికీకి ఏర్పడిన రంధ్రం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 24 : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పాత డీఎస్ఆర్ ఆసుపత్రి వెనుక వైపున మృత దేహన్ని శనివారం గుర్తించారు. మృతదేహం పురుగులుపట్టి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆ వ్యక్తి మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహం ఉన్న చోటుకి పైన క్రానిక్ వార్డు ఉంది. ఆ వార్డు తలుపులు ఊడిపోయి పెద్ద రంధ్రం ఉండటంతో అందులో నుంచి వ్యాధిగ్రస్తుడు కింద పడి తలకు బలంగా తగలడంతో మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు కూడా ఇదే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆసుపత్రి వర్గాలు మాత్రం సదరు వ్యక్తి తమ వద్ద చికిత్స పొందలేదని చెబుతున్నాయి. ఇదిలా ఉంటే మూడు రోజుల క్రితమే ఓ వ్యక్తి మృతి చెందితే అటు పారిశుధ్య సిబ్బందిగానీ, ఇటు భద్రతా సిబ్బందిగానీ గుర్తించక పోవటం పలు విమర్శలకు తావిస్తోంది. మృతుడు ఎవరనేది గుర్తించి, పూర్తిగా విచారణ జరిపించి వాస్తవాలు వెలికి తీయాల్సి ఉంది.

కావలిలో కొవ్వొత్తుల ర్యాలీ

కావలి, ఆగస్టు 24: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ టీమ్ సేవియర్స్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కావలి పట్టణంలో కొవ్వొత్తులు, ప్లకార్డులు పట్టుకుని నిరసన ర్యాలీని నిర్వహించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి ట్రంకు రోడ్డులో బీపీఎస్ వరకు ఈ ర్యాలీని కొనసాగింది. మధ్యలో బ్రిడ్జి సెంటర్‌లో కొంత సేపు నిరసన తెలిపారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ముందుగా సమాచారం అందచేసి వారి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చేపట్టిన ఈ ర్యాలీలో విద్యార్థులు పాల్గొన్నారు. దశాబ్దాల కాలంగా ఆడపిల్లలపై జరుగుతున్న అత్యాచారాలపై వివరిస్తూ అప్రమత్తతపై అవగాహన కల్పించారు. అంతకు మునుపు జవహర్‌భారతి నర్సింగ్ విద్యార్థులు కూడా ర్యాలీగా బ్రిడ్జి సెంటర్ వరకు వచ్చి నిరసన తెలిపారు.

పరిశ్రమల్లో పటిష్ట చర్యలు చేపట్టాలి

- సీఐటీయూ ధర్నా

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 24 : జిల్లాలోని పరిశ్రమల్లో అధికారులు తనిఖీలు నిర్వహించి కార్మికులకు పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం నెల్లూరులోని పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసింది. యూనియన్ జిల్లా అధ్యక్షుడు టీవీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 2500 వరకు పరిశ్రమలు ఉన్నాయన్నారు. ఆక్వా, ఫార్మా, పామాయిల్ పరిశ్రమల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయన్నారు. సరైన రక్షణ చర్యలు, అధికారుల పర్యవేక్షణ లేకపో వటంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ కారిడార్ కార్యదర్శి గోగుల శ్రీనివాస్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడే తనిఖీలు నిర్వహిస్తున్నారని, మిగిలిన సమయాల్లో పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీనివల్ల కార్మికుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, నాయకులు నాగేశ్వరరావు, కిన్నెర కుమార్, పెంచలనర్సయ్య, అల్లాడి గోపాల్, కొండ ప్రసాద్, మురళి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	226
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6896
వెండి కిలో ధర	రూ. 88,300
వెండి ఒక గ్రాము	రూ. 91.30



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఈవో రామారావు

విద్యార్థులు మేధో సంపత్తిని పెంచుకోవాలి

- జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో డీఈవో రామారావు

నెల్లూరు (విద్య), ఆగస్టు 24 : విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని మేధో సంపత్తిని పెంపొందించుకోవాలని డీఈవో రామారావు పిలుపునిచ్చారు. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ, విద్యాశాఖ సంయుక్తంగా జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వింజమూరు జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు ప్రథమ స్థానం, సంగం జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. విజేతలకు రూ.7వేలు, రూ.5వేలు చొప్పున నగదుతోపాటు సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏఎంవో సుధీర్ బాబు, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ భక్తవత్సలబాబు నాయుడు, ఉపాధ్యాయులు హరిబాబు, విజయ ప్రసూన, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు లక్పతి దీదీ

నెల్లూరు(హరనాథపురం): స్వయం సహాయక సంఘాల మహిళలను లక్షాధికారులను చేసే లక్పతి దీదీ కార్యక్రమం ఆదివారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మహారాష్ట్రలోని జలగాన్ నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా దేశంలోని స్వయం శక్తి సంఘాల మహిళలతో మాట్లాడతారన్నారు. ఈ కార్యక్రమం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ప్రసారమవుతుందని తెలిపారు.

రిజిస్ట్రేషన్ విలువలు పెంపునకు కసరత్తు

- భూ మార్పిడి జరిగిన భూముల వివరాలు సేకరణ


కావలి, ఆగస్టు 24: రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెంపుపై దృష్టి సారించింది. అందులో భాగంగా భూముల రిజిస్ట్రేషన్‌ల విలువలు పెంచి తద్వారా ఆదాయం పెంపొందించుకునేందుకు కసరత్తు చేపట్టింది. దీంతో విలువైన భూముల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. కావలి డివిజన్‌లో భూ మార్పిడి (ల్యాండ్ కన్వర్షన్) జరిగిన భూముల వివరాలు సమగ్రంగా తెలియచేయాలని ఆర్డీవో కార్యాలయ పరిధిలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్‌లు ఆర్డీవో కార్యాలయాన్ని సంప్రదించారు. వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా మారుస్తూ భూమార్పిడి జరిగి లేఅవుట్లు, పరిశ్రమల ఏర్పాటు, ఇళ్ల నిర్మాణాలకు కేటాయించారు. దీంతో ఆ భూముల మార్కెట్ విలువ పెరగడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా అలాంటి భూములను గుర్తించి వాటి ప్రభుత్వ విలువలు పెంచితే తద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని భావించారు. దీంతో భూమార్పిడి చేసిన భూముల వివరాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారు ఆర్డీవో కార్యాలయాల నుంచి సేకరిస్తున్నారు. వివరాల సేకరణ పూర్తి అయితే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి వెళ్లే ప్రతిపాదనల మేరకు త్వరలో వాటి మార్కెట్ విలువలను పెంచేందుకు రిజిస్ట్రేషన్ శాఖ సిద్ధమవుతోన్నట్లు తెలిసింది.

పేలుడుపై నమోదు కాని కేసు

ప్రమాదంలో మృతులున్నారంటూ వదంతులు
ఫ్యాక్టరీ ప్రముఖులది.. వెలుగులోకి రాని వాస్తవాలు

ముత్తుకూరు, ఆగస్టు 24 : మండలంలోని పంటపాలెం సమీపాన ఉన్న పామాయిల్ కర్మాగారంలో గత బుధవారం చోటుచేసుకున్న పేలుడుపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెంది ఉంటారని స్థానికంగా వదంతులు వ్యాపిస్తున్నాయి. నాలుగు రోజులైనా ఈ సంఘటనపై పామాయిల్ కర్మాగారం యాజమాన్యం ఫిర్యాదు చేయకపోవడం ఈ వదంతులకు బలం చేకూరుస్తోంది. అగ్నిప్రమాదం జరిగిన రోజు జిల్లా అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించి ప్రాణనష్టం ఏమీలేదని స్పష్టం చేశారు. అప్పుడు చోటుచేసుకున్న సంఘటనపై నాలుగురోజులు గడుస్తున్నా రెండు శాఖల అధికారులు ఇప్పటికీ కూడా ఎందుకని కేసు నమోదు చేయలేదో అర్థంకావడంలేదు. దీనిపై స్పందించేందుకు నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అందుబాటులో లేకపోగా కృష్ణపట్నం సీఐవెంకటరెడ్డి ఇప్పటి వరకు తమకు ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని శనివారం రాత్రి తెలిపారు. ప్రమాదం జరిగిన నాలుగు రోజులు దాటినా ఫ్యాక్టరీ యాజమాన్యం ఫిర్యాదు చేయకపోవడం, ప్రమాదం జరిగిన సమయంలో అక్కడికి చేరుకున్న జిల్లా అగ్నిమాపక సిబ్బంది, జిల్లా సేఫ్టీ శాఖాధికారులు, నెల్లూరు డీఎస్పీతోపాటు ఇతర పోలీసు అధికారులు ఎవరూ కూడా ఈ సంఘటనపై స్పందించకపోవడం గమనార్హం. అగ్నిప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపకశాఖ సిబ్బంది సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వాల్సి ఉంది. మరోవైపు జిల్లా పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని విచారించిన తర్వాత సుమోటోగా కేసును నమోదు చేయాల్సి ఉంటుంది. అయినా పామాయిల్ ఫ్యాక్టరీలో పేలుడు జరిగి నాలుగు రోజులవుతున్నా ఇప్పటివరకు ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు కాకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఈ ప్రమాదంలో ఫ్యాక్టరీకి చెందిన ఇతర ప్రాంతాల కార్మికులు పలువురు మృతి చెంది వున్నారని, ఈ వ్యవహారాన్నంతా దాచిపెట్టేందుకే ఈ తతంగం జరుగుతుందన్న వదంతులు వ్యాపిస్తున్నాయి. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు ఎంతమంది, బయటపడ్డవారు ఎంతమందో తెలిస్తే మృతుల వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. ఈ త్రీఎఫ్ ఫ్యాక్టరీ ప్రముఖులకు చెందిన సంస్థ కావడంతోనే వాస్తవాలు దాచిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారుల తోపాటు జిల్లా ఎస్పీ ఈ విషయంలో జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

దేశాభివృద్ధిలో జీఎస్టీది ప్రధాన భూమిక



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందకుమార్

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 24 : దేశాభివృద్ధిలో ప్రధాన భూమిక జీఎస్టీదేనని జీఎస్టీ కమిషనర్ (ఆడిట్) ఆనందకుమార్ తెలిపారు. శనివారం నెల్లూరులోని ఓ హోటల్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్, ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నెల్లూరు బ్రాంచి సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ఇందులో పాల్గొన్న ఆనంద కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా దేశ వ్యాప్తంగా ఒకే విధమైన గూడ్స్ సర్వీస్ టాక్సు(జీఎస్టీ) విధానాన్ని భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని చెప్పారు. వికసిత్ భారత్-2047 లక్ష్యంగా రానున్న ఐదేళ్లలో జీఎస్టీ విధానం ద్వారా ఎక్కువ మంది వ్యాపారులు, సంస్థలు సులభతర విధానంలో పన్నులు చెల్లించేలా తమశాఖ పనిచేస్తుందని వివరించారు. ఇటీవల విడుదల చేసిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మౌలిక సదుపాయాలకు రూ. 65 వేల కోట్లు, పోలవరానికి రూ. 10వేల కోట్లు కేటాయించారని తెలిపారు. ఇదంతా జీఎస్టీ ద్వారా వసూలైందని చెప్పారు. అనంతరం ఆడిటర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానమి చ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆడిట్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, ఐసీసీ చైర్మన్ సీహెచ్ యువరాజేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ గురుబ్రహ్మం, జిల్లా చైర్మన్ దాసా లక్ష్మీ నారాయణ, నెల్లూరు ఆడిట్ సర్కిల్ సూపరింటెండెంట్లు మల్లెల శ్రీనివాసరావు, ఎన్ జైనేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు కొనసాగుతున్న వరద

అనంతసాగరం, ఆగస్టు 24: సోమశిల జలాశయానికి గత నాలుగు రోజులుగా వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతుంది. అంతకు మునుపు 12 వేల క్యూసెక్కులు వస్తుండగా శనివారం నాటికి 16.967 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 30.291 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 2000, డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 210 క్యూసె క్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఘనంగా వెంకయ్యస్వామి ఆరాధన

ఆత్మకూరు, ఆగస్టు 24: మండలంలోని దేపూరులో భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. అనంతరం వెంకయ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొల్లా ఆదిశేషయ్యనాయుడు, పెంచలయ్యనాయుడు, తూమాటి శేషయ్యనాయుడు, తిరుతినాయుడు, దొడ్ల సుమన్, సర్పంచి రావిళ్ల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచి కర్నం వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగం : స్థానిక కొత్తూరులోని వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం ఆరాధనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, అనంతరం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సంగం :పూలాలంకరణలో వెంకయ్య స్వామి



ఆత్మకూరు : దేపూరు వెంకయ్యస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరులో కృష్ణాష్టమికి ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు, ఆగస్టు 24: పట్టణంలోని కృష్ణమందిరాల్లో కృష్ణాష్టమిని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక యాదవవీధిలో ఉన్న కృష్ణమందిరాన్ని నూతనంగా అలంకరించారు. అలాగే రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి మందిరంలో కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. సోమవారం ఉదయం స్వామివారికి అభిషేకంతో ప్రత్యేక పూజలు మొదలవుతాయి. ఉదయం 10.30 గంటలకు కల్యాణం నిర్వహించనున్నారు. ఉభయకర్తలుగా పచ్చిపాల మోహన్, పద్మ దంపతులు వ్యవహరిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు ఉట్టి కార్యక్రమం, రాత్రి 7 గంటలకు కుంకుమపూజ, ప్రసాదవినియోగం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే టెంకాయతోపులోని రాధాకృష్ణ మందిరంలో కూడా స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు.

సీఐకి సన్మానం

ఉదయగిరి రూరల్ : విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచి స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి నారాయణ, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ల చేతుల మీదుగా పోలీసు సేవా పతకం పొందిన ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబును శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో కావ్య కృష్ణారెడ్డి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి షేక్ సికిందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శ్రీనివాసులు, ఉస్మాన్‌గని. మున్నా, జనార్దన్, సందానీ, అలీబాబు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన 104 వాహనం



వరికుంటపాడు: స్థానిక వైద్యశాల నుంచి శనివారం వేంపాడులో నిర్వహించే శిబిరానికి వైద్యులు, సిబ్బందితో బయలుదేరిన 104 వాహనం కూతవేటు దూరంలోని కాకొల్లువారిపల్లి- రామాపురం గ్రామాల సమీపంలోని జాతీయ రహదారిపై ఆగిపోయింది. దీంతో చేసేదేమిలేక మోటారు బైకులపై వెళ్లిన సిబ్బంది మొక్కుబడిగానే కార్యక్రమాన్ని నిర్వహించారు. పైలెట్ మాత్రం రోజంతా వాహనం వద్దే పడిగాపులు కాయాల్సిన వచ్చింది.

'ప్రకాశం' ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రశంస

కందుకూరు, ఆగస్టు 24: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు అత్యుత్తమ ఫలితాలు సాధించటమే గాక క్రమ శిక్షణలో అగ్రగామిగా ఉన్నారని ఆంధ్రా బెటాలియన్ సుబేదార్ మేజర్ పుష్పరాజ్, హవల్దార్ కిమ్‌బహదూర్ థాపాలు ప్రశంసించారు. శనివారం కళాశాలలో జరిగిన ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బీ సర్టిఫికెట్ పరీక్షలో కళాశాల నుంచి 25 మంది క్యాడెట్లు పాల్గొనగా నూరుశాతం ఫలితాలు సాధించటమే గాక అత్యధిక మంది ఏ గ్రేడ్ సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, ఎన్‌సీసీ అధికారులు షేక్ ఇమాంస, సంతోష్‌కుమార్, మీరావలి పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

వలేటివారిపాలెం, ఆగస్టు 24 : పోకూరులో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకుడు చంద్రశేఖర్ తనిఖీ చేశారు. పశువైద్యశాలలో రికార్డులు పరిశీలించారు. అనంతరం మాల్యాద్రి డెయిరీ ఫాంను పరిశీలించి పాడిపరిశ్రమపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోకూరు పశువైద్యాధిదికారి పులి వంశి, లైవ్ స్టాక్ అసిస్టెంట్ అనుపమ, సిబ్బంది అశోక్, చౌడయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

కందుకూరు, ఆగస్టు 24: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఇంటర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు : ఎస్ఐగా షేక్ జిలాని శనివారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు. పోలీసు సిబ్బంది ఆయ న్ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన డీఎస్పీ వేణుగోపాల్‌ను సీఐ గంగాధర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి

సీతారామపురం మండలంలోని ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని హౌసింగ్ ఏఈ రామకృష్ణ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న ఇళ్లను శనివారం ఆయన పరిశీలించా రు.అనంతరం సీతారామపురంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద లబ్ధిదారులతో సమావేశాన్ని ఏర్పాటుచేశా రు.ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల బిల్లులు త్వరగా వస్తాయని, సిమెంట్.ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న కథనాలను నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ చెన్నరాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయాలని దుత్తలూరు పీహెచ్‌సీ ఆరోగ్య పర్యవేక్షకులు షేక్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. శనివారం మండలంలోని సోమలరేగడ ఎస్సీ కాలనీలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సరళ, ఆరోగ్య కార్యకర్త నారాయణ, ఏఎన్ఎం చంద్రావతి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మున్సిపల్ కార్యాలయం వద్ద టీడీపీ నేతల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, ఆగస్టు 24 : మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్రావుపల్లిలో జరుగుతున్న ఇంటి అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ శనివారం టీడీపీ నాయకుడు చల్లా రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ నిర్మాణంపై పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సమాచారం అందుకున్న సీఐ గంగాధర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సమస్యలను పరిష్కరించే వరకు నిరసన విరమించబోమని టీడీపీ నేతలు తెలిపారు. ఈ క్రమంలో వెంకట్రావుపల్లి సచివాలయం ఇన్‌చార్జ్ టీపీఎస్ సురేంద్ర అక్కడకు చేరుకుని అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేసి వచ్చామని తెలిపారు. దీంతో వారు నిరసనను విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గందళ్ల వేణు, మాజీ కౌన్సిలర్ పముజుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు

ఏఎస్ పేట,ఆగస్టు24: మట్టిని అక్రమంగా తవ్వి తరలించడంపై శనివారం తహసీల్దార్ శ్రీరామకృష్ణకు అక్కరాబాదు ఉపసర్పంచి బీ గురువారెడ్డి, బీజేపీ నాయకులు కప్పవరపు వెంకటేశ్వర్లు,జనసేన మండల అధ్యక్షుడు అక్బర్, పలువురు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. గ్రామ స మీపంలోని ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తవ్వి అమ్ముకుంటున్నారని వారు పేర్కొన్నారు. ఎక్స్‌కవేటర్‌తో పెద్ద పెద్ద గుంతలు తవ్వేస్తూ మట్టిని ట్రాక్టర్లతో తరలిస్తున్నారని వారు తెలిపారు. ఈ విషయమై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యూత్ ఫెస్ట్ క్విజ్‌లో సంగం విద్యార్థుల ప్రతిభ

సంగం, ఆగ స్టు 24: నెల్లూరు లో శనివారం జరిగిన జిల్లా యూత్ ఫెస్ట్ 2024 క్విజ్ పోటీల్లో సంగం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థునులు ద్వితీయస్థానం సాధించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని సోఫియా, 9వ తరగతి విద్యార్థిని ప్రణీక్ష పోటీల్లో పాల్గొని ద్వితీయస్థానం సాధించారు. వారికి డీఈవో రామారావు ప్రశంసాపత్రం అందచేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

మామిడిచెట్ల నరికివేతపై ఫిర్యాదు

అనంతసాగరం, ఆగస్టు 24: తన పొలంలోని మామిడి చెట్లను గ్రా మానికి చెందిన కొందరు నరికి వేశారని మండలంలోని రేవూరుకు చెందని పీ గిరిజారెడ్డి శనివారం తహసీల్దార్ వీరవసంతరావుకు ఫిర్యాదు చేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో తనకున్న 6.77 ఎకరాల వ్యవసాయ భూమిలో ఉన్న మామిడిచెట్లు, రేకుల షెడ్డును కొందరు తొలగించి ఎక్స్‌కవేటర్‌తో చదును చేసినట్లు తెలిపారు. ఇందులో ముగ్గురి ప్రమేయం ఉందని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

టీడీపీ, బీజేపీ నేతలకు అక్రమ లేఅవుట్లు లేవా?

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలిటౌన్, ఆగస్టు 24: మున్సిపల్ అధికారులు ప్రకటించిన అక్రమ లేఅవుట్లలో కేవలం వైసీపీ వారి పేర్లే ఉన్నాయని, టీడీపీ, బీజేపీ నేతల అక్రమ లే అవుట్లు ఎందుకు ప్రకటించలేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఎన్టీఆర్ కూడలిలోని 100 అడుగుల జాతీయ జెండా ఐకాన్‌ను ఆయన వైసీపీ నేతలతో కలిసి సందర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పైలాన్ ధ్వంసమైన చోటే పైలాన్ కట్టిస్తామన్న మంత్రి నారా లోకేష్ మాటకు విలువలేదా అని ప్రశ్నించారు. జాతీయ జెండా వద్ద ఫొటో గ్యాలరీలో మాజీ ఎమ్మెల్సీ క్విట్ ఇండియా ఉద్యమ నేత మధురాంతకం మాధవరావు, కావలి అభివృద్ధి ప్రదాత బీద రవిచంద్ర, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫొటోలు లేకపోవడం వారిని అవమానించడమేనన్నారు.

గురుకులంలో వైద్య శిబిరం

లింగసముద్రం, ఆగస్టు 24 : మండలంలోని పెదపవనిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకులంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం, రక్తహీనత, జాతీయ నులి పురుగుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్నేహలత, సీహెచ్‌వో జీ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.13,84,259

వలేటివారిపాలెం, ఆగస్టు 24 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.13,84,259 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం, కుంకుమార్చన, వివాహములు, తలనీలాలు, వాహనపూజలు, ప్రత్యేకదర్శనం, స్థలపురాణం పుస్తకాలు, రూము అద్దెలు, కవర్లు, లడ్డూప్రసాదం, అన్నదానం, విరాళాలు ద్వారా ఈ ఆదాయం లభించినట్లు తెలిపారు.

జడ్పీ హైస్కూల్ తనిఖీ

కావలి, ఆగస్టు 24: కావలి పట్టణం ముసునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎంఈవో వెంకటసుబ్బయ్య, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటయ్యతో కలిసి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, ఆగస్టు 24 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను లింగసముద్రం పోలీసులు శనివారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం బాజీబాబు తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

ఉలవపాడు, ఆగస్టు 24 : కౌమార దశలో యువత ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కలిగిఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీ గోపీచంద్ ప్రకాష్ అన్నారు. సింగరాయకొండ మండలంకు చెందిన మదర్ ల్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సంస్థ ప్రాజెక్టు మేనేజరు శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మదర్‌ల్యాండ్ సొసైటీ ఒఆర్‌డబ్ల్యూలు టీ సుభాషిణి, ఎమ్ వెంకట్రావు, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

31న అంతర్జాతీయ సదస్సు

కావలిటౌన్, ఆగస్టు 24: విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 31న ఐసీఆర్ఏసీఈ 2024 అంతర్జాతీయ సదస్సు జరగనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య తెలిపారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను శనివారం కళాశాలలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో సరికొత్త పరిశోధనలు నూతన ఆవిష్కరణలపై దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి పాల్గొననున్న ప్రొఫెసర్లు ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ లిఖిత్ రెడ్డి పాల్గొన్నారు.



ప్లాంటు స్విచ్ఛాన్ చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే దగుమాటి

గత ప్రభుత్వంలో సీఎంను కలవాలంటే గగనం

● నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

అల్లూరు, ఆగస్టు 24: గత ప్రభుత్వంలో జిల్లా అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిని కలవాలంటే గగనంగా ఉండేదని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు ఎన్నిసార్లు వెళ్లినా అభివృద్ధి కోసం ఏమి కావాలని అడుగుతున్నారని, ఇది ఆంధ్రరాష్ట్ర ప్రజల అదృష్టమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్త్‌మోపూరులో వీపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును శనివారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, బీద గిరిధర్, నెల్లూరు నిరంజన్‌రెడ్డి అమర్‌రెడ్డి, వేమిరెడ్డి కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులే మాట్లాడాలి : ఎమ్మెల్యే కావ్య

బిట్రగుంట, ఆగస్టు 24: మండల సమావేశాల్లో ప్రజలతో ఎన్నుకున్న ప్రజాప్రతినిధులే మాట్లాడాలని, ఇతరులు లోపలికి రాకూడదని, మాట్లాడకూడదని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి హితవు పలికారు. ఎంపీపీ ఎం.సుజాత అధ్యక్షతన శనివారం జరిగిన బోగోలు మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని శాఖల వారీగా సమీక్షించారు. ఈ సమావేశానికి కొందరు సర్పంచులు హాజరుకాకుండా వారి కుటుంబ సభ్యులు హాజరవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటసుబ్బారావు, తహసీల్దారు సురేష్‌బాబు, ఏవో గోవిందరావు, ఎస్సై బోజ్యా, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

15 జగనన్న కాలనీల్లో రూ.11 కోట్లతో 54 ఇళ్లు నిర్మించారు

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 24: మండలంలో 15 జగనన్న లేఅవుట్లు వేసి 506 ఇళ్లు మంజూరు చేసి రూ.11 కోట్లు ఖర్చు చేసి కేవలం 54 ఇళ్లు నిర్మించారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ ఇంటూరి సుశీల అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్న మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో భారీ దోపిడీ జరిగిందన్నారు. అధికారులు బాధ్యతతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ తొట్టెంపూడి అనసూయ, ఇంచార్జి ఎంపీడీవో వెంకటేశ్వరావు, తహసీల్దారు ఇక్బాల్, డీఎల్‌పీవో కృష్ణమోహన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా ఉలవపాడు మండల సమావేశం

ఉలవపాడు, ఆగస్టు 24 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. శాఖల వారీగా అధికారులు గణాంకాలు వివరించారు. సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులో ఒకరిద్దరు తప్ప ఎవరూ అధికారుల పనితీరును ప్రశ్నించలేదు. వీరేపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లేందుకు బస్సును గ్రామం వరకు కొనసాగించాలని మన్నేటికోటకు చెందిన సర్పంచు పులివర్తి బసవయ్యనాయుడు కోరారు. ఈ సమావేశంలో తహసీల్దారు లావణ్య, ఎంపీడీవో ఎన్ విజయ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు పొంగళ్లు



పొంగళ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కొండాపురం, ఆగస్టు 24: మండలంలోని సాయిపేట పంచాయతీ వెల్లటూరివారిపాలెంలో వెలసిన మహాలక్ష్మమ్మకు శనివారం భక్తులు పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని మక్కెనవారిపాలెం, వెల్లటూరివారిపాలెం, ఇస్కపాలెం గ్రామాలు సంయుక్తంగా పోలేరమ్మ గుడిని నిర్మించుకొని గత నాలుగు ఆదివారాలనుండి చద్ది సమర్పించారు. 5వ వారం ముందురోజు పొంగళ్లుపెట్టి నైవేద్యం సమర్పించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

వలేటివారిపాలెం, ఆగస్టు 24 : వలేటివారిపాలెం హైస్కూల్‌లో గత ఏడాది పదవ తరగతిలో ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2 వేల వంతున పూర్వ విద్యార్థి గుత్తా నరసింహం శనివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే 500 మార్కులు పైన సాధించిన 13 మందికి రూ.వెయ్యి వంతున అందజేశారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అట్టలు, పెన్నులు, అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కమల్‌కుమార్, మాజీ సొసైటీ అధ్యక్షుడు వలేటి నరసింహం, మాజీ ఎంపీటీసీ భర్త వీ. నరసింహం, గుత్తా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



స్వామి వారి దర్శనానికి క్యూ లైన్లో ఉన్న భక్తులు

బిట్రగుంట, ఆగస్టు 24: బోగోలు మండలం బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శ్రావణ శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. దాతలు అమరా బచ్చు ట్రస్ట్ నిధులతో నిర్వాహకులు కృష్ణకుమార్, సంధ్యలు నిర్మించిన కార్యానిర్వాహక భవనం, అన్నదాన సదన్‌లను ఆలయ ఈవో రాధాకృష్ణ, కావలి తహసీల్దారు శ్రావన్‌కుమార్ ప్రారంభించారు. మూడవ శ్రావణ శనివారం కావడంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు.

రెండు దుకాణాల్లో చోరీ?

బిట్రగుంట, ఆగస్టు 24: బోగోలు పంచాయతీలో దొంగలు రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడిన ఘటన శనివారం ఉదయం తెలిసింది. శుక్రవారం రాత్రి ఓ దుకాణంలో రూ.3వేలు, మరో దుకాణంలో రూ.500 అపహరించుకుని వెళ్లినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై బోజ్యాను వివరాలు కోరగా చోరీలపై ఎటువంటి ఫిర్యాదులు అందలేదన్నారు. అయితే చోరీ జరిగిందంటున్న ప్రచారంపై విచారణ చేపట్టామని తెలిపారు.

వైభవంగా ముందస్తు కృష్ణాష్టమి


తోటపల్లిగూడూరు : కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 24: మండలంలోని సౌత్ ఆములూరు మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అహ్మద్ బాషా, పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ వి గిరిజకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు కె విద్యుల్లత, బి కృష్ణవేణి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

●**ముత్తుకూరు:** కృష్ణపట్నం అదానీ వరల్డ్ స్కూల్‌లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ సిరియాల, అకాడమిక్ హెడ్ రాబిన్, కోఆర్డినేటర్లు ఉష, దేవకీ, సుమన్, ఉపాధ్యాయ, సహోపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

●**సైదాపురం:** స్థానిక గోకుల బృందావనం ప్రాథమిక పాఠశాల వద్ద శనివారం ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇందిర, ఉపాధ్యాయిని అరుణ, పాల్గొన్నారు.

●**మనుబోలు:** పిడూరుపాళెం గ్రామంలోని ఉజ్వల ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపాల్ చైతన్యయాదవ్ పాల్గొన్నారు.

● **పొదలకూరు** : పట్టణంలోని నాగార్జున, అమరావతి, విజేత, గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు అలరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీదుర్గ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కోనలో శ్రీవారి కల్యాణోత్సవం


కోనలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు, ఆగస్టు 24: పెంచలకోనలో శనివారం వేకువన 4గంటలకు స్వామివారికి అభిషేకం, 10.30 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 5.30గంటలకు తిరుచ్చి, పల్లకీసేవ, సహస్ర దీపాలంకరణ సేవలను వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా క్యూలైన్ల ఏర్పాటు, మంచినీటి సరఫరా, అన్నదాన కార్యక్రమాలను ఆలయ ఉప కమిషనర్ కేవీ సాగర్‌బాబు, ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆరాధనకు ఉచిత ఆటో సర్వీస్

వెంకటాచలం, ఆగస్టు 24: వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శనివారం ఉదయం వెంకయ్యస్వామి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత ఆటో సర్వీస్‌ను టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆటో యూనియన్ నాయకులు రాజాయాదవ్‌ను సన్మానించారు.

●**రాపూరు:** రాపూరుకు సమీపంలోని తిక్కన వాటిక పార్కు వద్ద ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో 18వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరుగు తున్నాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

●**బుచ్చిరెడ్డిపాళెం:** గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు సందర్భంగా మండలంలోని పంచేడు, మునులపూడి(దిన్నె), జొన్నవాడతోపాటు పలు గ్రామాలలో వెంకయ్య స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

శాంతి భద్రతలను కాపాడాలి

కొడవలూరు, ఆగస్టు 24: స్థానిక సీఐ సురేంద్రబాబును శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మండలంలో గత వైసీపీ ప్రభుత్వం ఆరాచకం రాజ్యమేలిదన్నారు. శాంతి భద్రతలను కాపాడాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పాటూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల నటి బండారు కన్నుమూత

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 24: రంగస్థల నటి బండారు పద్మావతి(60) కన్నుమూశారు. రేబాల గ్రామానికి చెందిన పద్మావతి గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై నెల్లూరు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆదివారం సాయంత్రం రేబాలలోని స్వగృహం నుంచి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతిష్ఠాత్మకంగా వెంకటాచలం నగరవనం

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి


నగరవనాన్ని పరిశీలిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

వెంకటాచలం, ఆగస్టు 24: వెంకటాచలం సమీపంలో నిర్మిస్తున్న నగర వనాన్ని అన్ని హంగులతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. జాతీయ రహదారికి అనుకొని వెంకటాచలం సమీపంలో నిర్మాణంలో ఉన్న నగరవనాన్ని శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అనంతరం అడవిలోని శివాలయంలో అభయ లింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ రహదారిపై నుంచి నగరవనంలోకి అనుసంధాన మార్గం, రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే నెంబర్ 1గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. రూ.5కోట్ల అంచనాతో చేపట్టిన నగరవనంలో ప్రాజెక్టు రెస్టారెంట్, చిల్డ్రన్స్ పార్కు, విశాలమైన పార్కింగ్, అడ్వెంచర్ గేమ్స్, యోగా సెంటర్, థీమ్ బేస్డ్ ప్లాంటేషన్, ఆర్టిఫిషియల్ వాటర్ ఫాల్స్, బోట్ క్లబ్, ఓపెన్ జిమ్, మినరల్ వాటర్ ప్లాంట్ తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. మరో పది రోజుల్లో మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి నగరవనాన్ని సందర్శించి అవసరమైన వసతుల కల్పనతోపాటు నిధుల సమీకరణపై సమీక్షిస్తామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పలువురు ఎన్డీఏ కూటమి నేతలు పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధిగ్రస్థులకు చేయూత


ప్రొవిజన్ షాపు ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

తోటపల్లిగూడూరు, ఆగస్టు 24: లెప్రసీ వ్యాధిగ్రస్థులకు డేమియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని జిల్లా వైద్యాధికారి పెంచలయ్య పేర్కొన్నారు. మండలంలోని మాచర్ల వారిపాలెం పంచాయతీ పరిధిలోని గణపతినగర్‌లో శనివారం డేమియన్ ఫౌండేషన్ వారు లెప్రసీ వ్యాధిగ్రస్తురాలైన గోడ విజయమ్మకు ప్రొవిజన్ షాప్ ఏర్పాటుచేసినందుకు రూ.45వేలు ఆర్థిక సహాయం అందజేశారని డీఎంహెచ్‌వో తెలిపారు. వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని, సకాలంలో వైద్యం చేయించుకోవాలన్నారు. అనంతరం ప్రొవిజన్ షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ అధికారి ఎస్‌కె ఖాజావలి, డేమియన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ సతీష్, వరిగొండ వైద్యాధికారిణి డాక్టర్ రాధిక, ప్రసాద్‌ఆచారి, ఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

నాగరాజుతోపులో 104 ఉచిత వైద్య శిబిరం

ఇందుకూరుపేట, ఆగస్టు 24: మండలంలోని లేబూరు బిట్-1 పరిధిలో నాగరాజుతోపు గ్రామంలో శనివారం జగదేవిపేట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు 104 ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సీహెచ్ సుధాకర్‌రావు, సీహెచ్‌వో విద్యాసారిక, హెల్త్ అసిస్టెంట్ ఖాదర్‌బాషా, హెల్త్ సెక్రటరీ సుశీలమ్మ, 104 వైద్య సిబ్బంది, ఆశా వలంటీర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ఎన్డీఏ కూటమి లక్ష్యం

వెంకటాచలం, ఆగస్టు 24 : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలను కూడా భాగస్వాములు చేసేందుకే గ్రామసభలు నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుమినేని వాణిభవాని, నాయకులు కాకి శివకుమార్, ఆస్తోటి రవికుమార్, షేక్ రహీమ్ తదితరులున్నారు.

పారిశుధ్య పనులు చేయమని అడిగితే రభస చేశారు

విడవలూరు, ఆగస్టు 24: గ్రామంలో పారిశుధ్య పనులు చేయాలని గ్రామసభలో అడిగితే గ్రామ సర్పంచ్, ఆమె భర్త రగడ చేశారని దండిగుంట గ్రామ టీడీపీ నాయకుడు కుడుముల మల్లికార్జునరావు ఆరోపించారు. గ్రామంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు గ్రామంలో సమస్యలను ఏకరువు పెడితే దానికి సమాధానం చెప్పకుండా గొడవ చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. టీడీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటస్వామి, యోసోబు, కోవూరు రమణయ్య, ఈదూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

'నిందారోపణలు చేయడం తగదు'

గ్రామసభను అడ్డుకున్నామని టీడీపీ నాయకులు నిందారోపణలు చేయడం తగదని దండిగుంట గ్రామ సర్పంచ్ బెల్లంకొండ సుప్రజ తెలిపారు. పంచాయతీలో నిధుల కొరత వల్ల గ్రామంలో పనులు నిలిచిపోయాయని, త్వరలో చేపడతామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ భర్త బెల్లంకొండ శ్రీధర్, మస్తానయ్య, తదితరులు ఉన్నారు.

పున్నూరులో వరి పొలాల సందర్శన

ఇందుకూరుపేట, ఆగస్టు 24 : మండలంలోని పున్నూరులో వరి పొలాలను సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ రాజ్‌కుమార్ శనివారం క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన వరి పైరును నల్లి ఆశిస్తుందని, దాని నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు తెలియజేశారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంటలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పున్నూరు ఉప సర్పంచ్ శోభన్‌బాబు, ఎంపీటీసీ కరుణాకర్, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బాలికోన్నత పాఠశాలలో మరుగుదొడ్లకు మోక్షం


మరుగుదొడ్ల పనులు నిర్వహిస్తున్న కార్మికులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 24: పెద్దూరులోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, బాత్‌రూముల పనులను ఎమ్మెల్యే, అధికారుల చొరవతో కాంట్రాక్టర్ పనులు నిర్వహిస్తున్నారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'మరుగుదొడ్లు లేక బాలికల అగచాట్లు' పేరుతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ సమస్యపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, డీఈఓ రామారావు, ఎస్ఎస్ఏ పీడీ ఉషారాణి స్పందించి వెంటనే గర్ల్స్ హైస్కూల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేసి బాలికల ఇబ్బందులు తొలగించాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం నుంచి పనులు చేపట్టినట్టు హెచ్‌ఎం సుజాత తెలిపారు. నాలుగు రోజుల్లో పనులు పూర్తవుతాయన్నారు. కాగా, స్థానిక నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు, టీడీపీ నాయకులు శనివారం బాలికోన్నత పాఠశాలలో మరుగుదొడ్ల పనులను పరిశీలించారు.

మెడబట్టి బయటకు గెంటేశారు !

● వెంకయ్యస్వామి కుటుంబ సభ్యుల ఆవేదన


మీడియాతో మాట్లాడుతున్న సొంపల్లి పెంచలయ్య

వెంకటాచలం, ఆగస్టు 24: వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో చివరి రోజైన శనివారం స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన తమను పోలీసులు గుడిలోనికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారని స్వామి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. తాను వెంకయ్య స్వామి తమ్ముడి కుమారుడినని, తన పేరు సొంపల్లి పెంచలయ్య అని చెప్పారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆశ్రమ ఈవో తన చొక్కా పట్టుకొని మెడబట్టి బయటకు గెంటేశారని, తాము గుడిలోకి వెళ్లకుండా బయటే టెంకాయలు కొట్టి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

నగర పంచాయతీ కమిషనర్‌కు సన్మానం

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 24: నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు బదిలీ సందర్భంగా శనివారం ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, పలువురు కౌన్సిలర్లు, సిబ్బంది, అధికారులు, నాయకులు ఆయనను సత్కరించారు. కాగా, చంద్రశేఖర్‌రెడ్డిని కమిషనర్‌గా నియమించారు.

సైదాపురం ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

సైదాపురం : సైదాపురం ఎస్ఐగా క్రాంతికుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో శాంతి భద్రతలు పరిరక్షిస్తామన్నారు. సిబ్బంది ఎస్ఐకు స్వాగతం పలికారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 24 : నగరంలోని ఎన్‌సీసీ కాలనీలో ఉన్న వెంకయ్యస్వామి ఆశ్రమంలో 32వ ఆరాధన మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతసేవ, గణపతి పూజ, కలిశ పూజ, పూలంగిసేవ జరిగాయి. దుర్గం దాక్షాయణమ్మ భక్త బృందం సాయంత్రం వరకు భజన కార్యక్రమం నిర్వహించింది. రాత్రి కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. సత్యహరిశ్చంద్ర నాటకం కాటి సీను, శ్రీకృష్ణ రాయబారం పడక సీను ప్రదర్శించారు. ఆలయ చైర్మన్ ముత్యం నరసింహులు, గౌరవాధ్యక్షుడు ఉదయగిరి నరసింహులు గౌడ్, దుగ్గనబోయన బాపూజీ ముదిరాజ్, తదితరులు పర్యవేక్షించారు.

ప్రపంచ ఆర్ట్స్ వర్క్‌షాపులో నెల్లూరీయుడికి సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం): కోల్‌కతాలో ఇటీవల నిర్వహించిన ప్రపంచ ఆర్ట్స్ వర్క్‌షాపులో జిల్లా నుంచి ప్రముఖ చిత్రకారుడు వీ సుందర్ పాల్గొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ నుంచి 71 మంది చిత్రకారులు పాల్గొన్నారు. వీరికి చిత్రలేఖన పోటీ నిర్వహించారు. వారు గీసిన చిత్రాలను ఠాకూర్ సెంటర్‌లోని ఐసీసీఆర్ గాలరీలో ప్రదర్శించారు. ముగింపు సందర్భంగా సుందర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ ఎగ్జిబిషన్‌కు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఆర్ట్స్ జోనల్ డైరెక్టర్ మీనాక్షి మిశ్రా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

'సింగిల్ విండో' అనుమతులివ్వాలి

● కలెక్టర్‌కు గణేష్ ఉత్సవ సమితి వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఉత్సవ సమితి నేతలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 24 : వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి సింగిల్ విండో పద్ధతిన కార్పొరేషన్, పోలీసు, విద్యుత్ శాఖ, ఫైర్ శాఖల అధికారులు అనుమతి పత్రాలు అందచేసేలా చర్యలు తీసుకోవాలని విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి కలెక్టర్ ఆనంద్‌ను కోరింది. ఈ మేరకు శనివారం కలెక్టర్‌కు ఆయన చాంబర్‌లో వినతి పత్రం అందచేశారు. సమితి అధ్యక్షుడు పీ సత్యనారాయణ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగే శోభాయాత్ర, నిమజ్జనోత్సవాల విజయవంతానికి అన్ని శాఖలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి పీ సురేంద్రరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మహేష్, బండి ప్రసాద్, ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, కేవీ సుబ్రహ్మణ్యం, కొండపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాయి దర్బార్ వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం): బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ (అద్దాల మందిరం) శ్రీసాయి మాతా అన్న ప్రసాద నిలయం తృతీయ వార్షికోత్సవం ఆది, సోమవారాల్లో జరుగుతుందని ఆ మందిరం చైర్మన్ మధుసాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మాతా,శిశు ఆరోగ్యమే లక్ష్యం : డీఐవో

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 24 : మాతా,శిశు ఆరోగ్యమే లక్ష్యంగా విధులు నిర్వహించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమా మహేశ్వరి ఆదేశించారు. శనివారం చంద్రమౌళి నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాతా,శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బాలింతల సంరక్షణ, పురుటి బిడ్డల సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ సంక్షేమం, కుటుంబ నియంత్రణ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పఠాన్ ఇమ్రాన్, డాక్టర్ హర్షిత, కో ఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నగర ప్రజలకు ఉచిత అంబులెన్స్ సేవలు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 24 : నెల్లూరు నగర ప్రజలకు ఉచిత అంబులెన్స్ సేవలు అందించేందుకు సంస్కార్ ట్రస్ట్ ముందుకు వచ్చింది. ట్రస్ట్ చైర్మన్ చేవూరు వెంకటస్వామి నిర్వహిస్తున్న ఉచిత అంబులెన్స్ సేవలను శనివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. నగరంలో 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న రోగులను ఈ వాహనంలో ఆసుపత్రికి చేరుస్తారని చెప్పారు. అలాగే, ఆసుపత్రిలో మృతి చెందిన వారి పార్థివ దేహాలను ఇంటికి చేరుస్తారన్నారు. కొంత మంది అంబులెన్స్‌ల ద్వారా విపరీతంగా చార్జీలు వసూలు చేస్తున్నారని, అలా కాకుండా ఇతర ప్రాంతాలకు అతి తక్కువ ధరలకే ట్రస్ట్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ట్రస్ట్ సేవల కోసం ఫోన్ నెంబర్ 8309507598ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత సురేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, బీజేపీ నాయకులు మొగరాల సురేష్, విజయ, సంస్కార్ ట్రస్ట్ కార్యదర్శి పెళ్లూరు ధనయ్య, యనమల కృష్ణ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పర్యవేక్షణ

నెల్లూరు రూరల్, ఆగస్టు 24 : నగరంలోని ఇస్కాన్‌సిటీ వద్ద డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులను స్థానిక నాయకులతో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ఆయా ప్రాంతాల్లోని నాయకత్వంపై ఉందన్నారు. అనంతరం కార్యాలయంలో 36వ డివిజన్ టీడీపీ నాయకుడు బుర్ర వెంకటేశ్వర్లుగౌడ్ అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ. 50 వేలు నగదు చెక్కును గిరిధర్‌రెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, నాయకులు జెన్ని రమణయ్య, సాయిబాబా, దార మల్లి, ఖాదర్‌బాషా, అన్నంగి రమణయ్య పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలను గౌరవించండి

నెల్లూరు (సాంస్కృతికం) : మూలస్థానేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల మనోభావాలను గౌరవించాలని బీజేపీ నాయకులు దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం సహాయ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ నాయకుడు మిడతల రమేష్ మాట్లాడుతూ ప్రదోషకాల పూజ అనంతరం మూలస్థానేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు రూ.50 టికెట్టు కొనాలని చెప్పడం తగదన్నారు. డబ్బుతో దర్శనానికి ముడి పెట్టకుండా పాత పద్ధతిలోనే భక్తులకు దర్శనం కలిపించాలని కోరారు.

రాష్ట్ర టీ-20 ఫైనల్స్‌లో నెల్లూరు-గుంటూరు

నెల్లూరు (విద్య), ఆగస్టు 24 : నగరంలోని బుజబుజ నెల్లూరులో గల సీఐఏ క్రికెట్ మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వెటరన్ టీ-20 క్రికెట్ పోటీల్లో నెల్లూరు-గుంటూరు జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మూడురోజులు జరిగిన లీగ్ పోటీల్లో పూల్-ఏలో రెండు మ్యాచ్‌లు గెలిచిన నెల్లూరు జట్టు, పూల్-బీలో రెండు మ్యాచ్‌లు గెలిచిన గుంటూరు జట్టు ఫైనల్‌కు చేరుకున్నాయి. శనివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో అనంతపురం, కడప జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 137 పరుగులు సాధించింది. ఛేదనలో కడప జట్టు 20 ఓవర్ల లో 6 వికెట్ల నష్టానికి 122 పరుగులు మాత్రమే చేసి ఓట మిపాలైంది. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో నెల్లూరు, హైదరాబాద్ జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 143 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 19.1 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ కావడంతో 11 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్‌లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు పీ భాను ప్రకాష్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పర్యవేక్షించారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెక్కుల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 24 : ఏపీఆర్‌ఎస్‌ఏ అభ్యర్థన మేరకు రెవెన్యూశాఖ ఉద్యోగులైన రీసర్వే డీటీ పీ కామాక్షి, ఆర్‌ఐ ప్రశాంత్‌కు కలెక్టర్ ఆనంద్ శనివారం ఆయన చాంబర్‌లో మెడికల్ రీయింబర్స్‌మెంట్ అడ్వాన్స్ కింద చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.2 లక్షల వంతున అందచేశారు. ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఆర్థిక సహాయం చేసిన కలెక్టర్ ఆనంద్‌కు, జేసీ కార్తీక్, డీఆర్వో లవన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, ఏపీఆర్‌ఎస్‌ఏ నాయకులు డానియల్ పీటర్, బొబ్బ మురళి, గోపీకృష్ణ, ప్రదీప్, బాలకోటమ్మ పాల్గొన్నారు.

సిటీ ప్లానింగ్ సమస్యలకు పరిష్కార వేదిక

నెల్లూరు(సిటీ), ఆగస్టు 24 : నగరంలో ఇంటినిర్మాణ అనుమతులకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో సిటీ ప్లానింగ్ ప్రత్యేక పరిష్కార వేదిక నిర్వహించారు. సీపీ దేవికుమారి, టీపీవో దశయ్య, టీపీఎస్‌లు పాల్గొన్నారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాలు అందచేశారు. వాటిని స్వీకరించిన యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పరిశీలించాక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నగరపాలక పాఠశాలలో పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న కమిషనర్ ఆనందకుమార్

నెల్లూరు (విద్య), ఆగస్టు 24 : నగరంలోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఏఆర్‌కే ట్రస్ట్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో జీఎస్టీ (ఆడిట్) రాష్ట్ర కమిషనర్ ఆనందకుమార్ పాల్గొన్నారు. పేద విద్యార్థులకు చేయూ తనందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషాకిరణ్ రాయ్, నారాయణ డెంటల్ ఆసుపత్రి హెచ్‌వోడీ కన్నన్, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఏపీయూడబ్ల్యూజే నాయకుడు జయప్రకాష్, ఏఆర్‌కే ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో 'జనవాణి'


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట), ఆగస్టు 24: జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జనవాణి కార్యక్రమాన్ని నాయకులు ప్రారంభించారు. పార్టీ కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారం కోసం జనసేన పార్టీ కార్యాలయంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గునుకుల కిషోర్, శ్రీరామ్, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, కొట్టే వెంకటేశ్వర్లు, నందిని, భవాని తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాల కోసం వెల్ఫేర్‌డే

నెల్లూరు(క్రైం),ఆగస్టు 24: విధులు నిర్వహిస్తూ చనిపోయిన పోలీసు కుటుంబాలు, ఉద్యోగ విరమణ చేసిన పోలీసులతో శనివారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో వెల్ఫేర్‌డే నిర్వహించారు. పోలీసు కుటుంబ సభ్యులతో ఎస్పీ కృష్ణకాంత్ నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బందితో చర్చించి ఆయా సమస్యల పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. అనంతరం పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్ సిబ్బందికి సంబంధించిన పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య, అసోసియేషన్ నాయకులు తురకా శ్రీనివాసులు, మదన్ పాల్గొన్నారు.


శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

'ఇట్టీబిట్టీ'లో కృష్ణాష్టమి వేడుకలు

నెల్లూరు (విద్య), ఆగస్టు 24 : నగరంలోని బాలాజీ నగర్ ఇట్టీ బిట్టీ పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శశి రాజేంద్ర, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రత్నం పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

నెల్లూరు (విద్య), ఆగస్టు 24 : నగరంలోని డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణ జననం, జన్మాష్టమి విశిష్టతను తెలిపేలా రూపొందించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. పాఠశాలలో ఏర్పాటు చేసిన గోకులం, గోవర్ధన పర్వతం నిర్మాణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యా సంస్థ డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతికిషోర్ విద్యార్థులకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రపూర్ణ, జాస్మిన్, నాగేంద్ర పాల్గొన్నారు.

శేషు స్కూల్లో..

నెల్లూరు రూరల్: బుజబుజ నెల్లూరులోని శేషు స్కూల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. కృష్ణాష్టమి ప్రత్యేకతను చాటుతూ చేసిన నృత్యాలు, ఆకర్షించాయి. ఉట్టి మహోత్సవంలో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బీ శేషుయాదవ్, ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

జాతీయ సైనిక శిబిరానికి 'డీకే' విద్యార్థిని


విద్యార్థిని వెంకట రమణ

నెల్లూరు (విద్య), ఆగస్టు 24 : ముంబైలో జరగనున్న ఆలిండియా నౌ సైనిక్ క్యాంప్ షిప్ మోడలింగ్ విభాగానికి నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ నేవల్ యూనిట్ విద్యార్థిని బీ వెంకట రమణ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి తెలిపారు. కళాశాలలో శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థిని జాతీయ స్థాయి సైనిక శిబిరానికి ఎంపికవడం అభినందనీయన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరింత ఉత్తమంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం నావెల్ యూనిట్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గోడంగొపే, షిప్ మోడలింగ్ ఇన్‌స్పెక్టర్ రామన్, పీఐ స్టాఫ్ వెంకటేష్ రాథోడ్, సుధాకర్, లోకేష్, నావెల్ యూనిట్ కేర్ టేకర్ డాక్టర్ వై దివ్య విద్యార్థినిని అభినందించారు.



జూనియర్ డాక్టరుపై దాడికి పాల్పడుతున్న బంగారు రాజు

వారం కిందట స్విమ్స్ ఆవరణలోనే విధులకు వస్తున్న వైద్యురాలితో ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు ఎలాంటి చర్యల్లేవు. కేసూ నమోదు చేయలేదు. ఇప్పుడు.. ఓ మహిళా డాక్టరుపై రోగి దాడి చేశారు. సహచర వైద్యులు అడ్డుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇలాంటివి చాలా జరిగాయి. ఈ పరిస్థితుల్లో మేమెలా వైద్యం అందించ గలం? కోల్‌కతాలాంటి ఘటనలు జరిగితే కానీ స్పందించరా?

ఇదీ టీటీడీ యాజమాన్యానికి స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్ల (జూడాలు) సూటి ప్రశ్న.

మాపై ఎందుకింత నిర్లక్ష్యం



న్యాయం కోసం గంటల తరబడి నిరసన తెలుపుతున్న మా కోసం ఒక్క పది నిమిషాలు వచ్చి వెళ్లే సమయం టీటీడీ అధికారులకు లేదా? మాపై ఎందుకింత నిర్లక్ష్యం? డ్యూటీలో ఉన్న వైద్యులకు గట్టి భద్రత కల్పించమనే కదా అడుగుతున్నాం.

- తేజశ్రీ, జూనియర్ డాక్టరు

వైద్యురాలి ప్రాణాలు పోయి ఉంటే..



కోల్‌కతాలో వంటి ఘటన ఇక్కడ జరిగితేనే టీటీడీ అధికారులు స్పందిస్తారా? మాకు రక్షణ కల్పించడానికి ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలియడం లేదు. ఈ రోజు జరిగిన దాడిలో వైద్యురాలి ప్రాణాలు పోయి ఉంటే దానికి ఎవరు బాధ్యత వహిస్తారు?

- విష్ణుశ్రీ, జూనియర్ డాక్టరు

'కోల్‌కతా'వంటి ఘటన
జరిగితేనే స్పందిస్తారా?



జూనియర్ డాక్టర్లకు నచ్చజెబుతున్న పోలీసులు, స్విమ్స్ డైరెక్టర్, తదితరులు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 24: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని వ్యతిరేకిస్తూ ఓ పక్క నిరసనలు చేస్తుంటే.. స్విమ్స్‌లో ఓ వైద్యురాలిపై రోగి దాడి చేయడం కలకలం సృష్టించింది. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో స్విమ్స్ అత్యవసర విభాగంలో విధుల్లో ఉన్న హౌస్‌సర్జన్ డాక్టర్ స్పందనపై అక్కడ చికిత్స పొందుతున్న బంగారు రాజు అనే రోగి దాడికి పాల్పడ్డాడు. విజయనగరం జిల్లాకు చెందిన ఇతను శుక్రవారం శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో తొలుత తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి స్విమ్స్‌కు రెఫర్ చేయడంతో అత్యవసర విభాగానికి తీసుకొచ్చి, చికిత్స అందిస్తున్నారు. ఉన్నట్టుండి ఇతడువిధుల్లోని జూనియర్ డాక్టర్ స్పందన తలను మంచానికేసి కొట్టాడు. మిగతా వైద్యులు అతడిని అడ్డుకోవడంతో స్వల్ప గాయంతో ఆమె బయటపడ్డారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, తమకు రక్షణ లేదంటూ



చికిత్స పొందుతున్న బంగారు రాజు

స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్లు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అత్యవసర విభాగం ముందు నిరసనకు దిగారు. రెండు గంటల పాటు వీరి నిరసనను ఎవరూ పట్టించుకోక పోవడంతో డైరెక్టర్ డౌన్ డౌన్, ప్రిన్సిపాల్ డౌన్ డౌన్, నో సేఫ్టీ.. నో సర్వీస్ అంటూ నినాదాలు చేశారు. స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్, శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఉషా కళావత్ వచ్చి జూడాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. 'మీ మాటలపై మాకు నమ్మకం లేదు. టీటీడీ ఈవో వచ్చి మా రక్షణపై లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే నిరసన విరమిస్తాం' అని భీష్మించుకున్నారు. రాత్రి ఎనిమిది గంటల తర్వాత టీటీడీ అదనపు సీవీఎస్వో శివకుమార్ వచ్చి.. ప్రస్తుతం ఉన్న 140 మంది సెక్యూరిటీతో పాటు అదనంగా మరో 70 మందితో భద్రతా చర్యలు చేపడతామని, రాపిడ్ సెక్యూరిటీ ఫోర్స్ ఏర్పాటు,



మొబైల్ రక్షక భటులతో నిరంతరం గస్తీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనికికూడా జూడాలు శాంతించలేదు. భద్రత కల్పించే బాధ్యత తమదని వెస్ట్ డీఎస్పీ వెంకట నారాయణ హామీ ఇవ్వగా.. వారం కిందట ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడంపై ఫిర్యాదు చేస్తే ఇంత వరకు కేసు ఎందుకు నమోదు చేయలేదని జూడాలు ప్రశ్నించారు. కేసు ఎందుకు నమోదు చేయలేదని సీఐ రామకృష్ణను డీఎస్పీ అడిగారు. కేసు నమోదు చేయని వారికి వెంటనే చార్జి మెమో జారీ చేస్తామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు. అయినా ఈవో వస్తేనే ఆందోళన విరమిస్తామని జూడాలు తేల్చిచెప్పారు. రాత్రి 11.40 గంటల ప్రాంతంలో జేఈవో గౌతమి వచ్చి సర్దిచెప్పినా జూడాలు వినిపించుకోకుండా నిరసన కొనసాగించారు.

5లోగా ఉపాధ్యాయ పురస్కారానికి ప్రతిపాదనలు

తిరుపతి(విద్య), ఆగస్టు 24: ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం కోసం ప్రతిపాదనలు పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సెప్టెంబరు 5వతేదీ లోగా ప్రతిపాదనలను ఉప, మండల విద్యాశాఖాధికారుల ద్వారా పంపించాలని సూచించారు. నిర్ణీత గడువు దాటాక ప్రతిపాదనలు స్వీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

మొదలైంది

● తిరుపతిలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై సీఐడీ విచారణ

- పలు ఫైళ్ల స్వాధీనం
- సహకరించని అధికారులు?

తిరుపతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో జరిగిన ట్రాన్స్‌ఫర్ బుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణంపై సీఐడీ అధికారులు విచారణ మొదలుపెట్టారు. శనివారం నలుగురు సీఐడీ అధికారుల బృందం కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లింది. పట్టణ ప్రణాళిక విభాగంలో పలు డాక్యుమెంట్లను పరిశీలించారు. టీడీఆర్ బాండ్ల అవకతవకలపై వివరాలు సేకరించారు. స్థల సేకరణలో ఎకరాల్లో గుర్తించి, బాండ్ల జారీకి చదరపు గజాల్లో లెక్కించినట్టు, అగ్రికల్చర్, రెసిడెన్షియల్ పరిధిలోని స్థలాలను కూడా కమర్షియల్‌గా రిజిస్ట్రేషన్ విలువ పెంచేసి భారీగా లబ్ధిపొందినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్టు సమాచారం. మరింత లోతుగా విచారించేందుకు తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో ఒక గదిని ఏర్పాటు చేయాలని సీఐడీ బృందం మున్సిపల్ ఉన్నతాధికారులను అడిగినట్టు తెలిసింది. అయితే టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డి.. సీఐడీ అధికారుల బృందం వచ్చే సమయంలో కార్యాలయం నుంచి ఉద్దేశ పూర్వకంగానే వెళ్లిపోయినట్టు సమాచారం. దీంతో కిందిస్థాయి సిబ్బందితో మాట్లాడి పలు ఫైళ్లను తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే తిరుపతి కార్పొరేషన్లో డిప్యుటేషన్‌పై పనిచేసిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రహ్మణ్యంపై పదిరోజుల క్రితం ప్రభుత్వం బదిలీవేటు వేసిన విషయం తెలిసిందే. తిరుపతి ఏసీపీగా డిప్యుటేషన్ రద్దు చేస్తూ రాజంపేట మున్సిపాల్టీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో)గా బదిలీచేశారు. అయితే అక్కడ బాధ్యతలు స్వీకరించకుండా తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ప్లానింగ్ విభాగంలో చేరేందుకు బాలసుబ్రహ్మణ్యం చక్రం తిప్పుతున్నట్టు తెలుస్తోంది. ఆయనకు తుడా ప్లానింగ్ విభాగంలో పోస్టింగ్ ఇవ్వాలని తిరుపతి, చంద్రగిరి కూటమి ఎమ్మెల్యేలు కూడా సిఫారసు లేఖలు అందజేసినట్టు సమాచారం. ఓవైపు టీడీఆర్ బాండ్ల అక్రమాలను నిగ్గు తేల్చాలని టీడీపీ నేతలు ఆనం వెంకటరమణారెడ్డి, రవినాయుడు అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి విచారణకు ఆదేశిస్తే, మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను తిరిగి తెప్పించుకునేందుకు కూటమి ఎమ్మెల్యేలే సమర్థించడం విమర్శలకు తావిస్తోంది.

శ్రీవారి సేవలో 'సరిపోదా శనివారం'



'సరిపోదా శనివారం'చిత్ర హీరో నాని, హీరోయిన్ ప్రియాంక మోహన్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈనెల 29వ తేదీన ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో వీరు శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. రాత్రి తిరుమలలోనే బసచేసి శనివారం ఉదయం నాని దంపతులతోపాటు ప్రియాంక ఆలయంలోకి వెళ్లి తిరుమలేశుడిసేవలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గంజాయి..
సై..రన్!



వైద్యశాలలో చికిత్స పొందుతున్న డీఎస్పీ



పోలీసుల అదుపులో కారు డ్రైవర్ సూర్యనారాయణ

- అర్ధరాత్రి ముఠా కోసం పోలీసుల చేజింగ్
- నెల్లూరు రూరల్ డీఎస్పీపైకి దూసుకెళ్లిన కారు
- నెల్లూరు, తిరుపతి పోలీసుల అప్రమత్తం
- గూడూరు మీదుగా కడప జిల్లాలోకి వెళ్లే ప్రయత్నం
- అడుగడుగునా వెంబడించిన పోలీసులు
- కాలువలోకి దూసుకెళ్లిన సీఐ వాహనం
- కోనసముద్రం దాటాక ఆగిన చేజింగ్
- రోడ్డు లేకపోవడంతో పొలాల్లో ఆగిన కారు
- డ్రైవర్ అరెస్ట్.. మరో ఇద్దరు ఏమయ్యారు?
- పూర్తిస్థాయిలో విచారిస్తున్న పోలీసులు

ఎర్రచందనం దుంగలు, గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాలను పట్టుకునేందుకు పోలీసు వాహనాలు రయ్.. రయ్... మంటూ దూసుకుపోయే దృశ్యాలు సినిమాల్లో చూస్తుంటాం. సాహసోపేత చేజింగ్‌లు చేసి చివరకు దొంగలను పట్టుకుంటారు. అలాంటి సీన్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సాగింది. ఓ గంజాయి ముఠాను పట్టుకునేందుకు నెల్లూరు, తిరుపతి జిల్లాల పోలీసులు రాత్రంతా కంటిమీద కునుకులేకుండా కష్టపడ్డారు. చివరకు కారుతోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ చేజింగ్‌లో డీఎస్పీ గాయాలపాలవగా, ఇద్దరు సీఐలకు త్రుటిలో ప్రమాదం తప్పింది.

● అసలేం జరిగిందంటే..

విశాఖ నుంచి చెన్నైకి ఓ వాహనంలో భారీగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం శుక్రవారం రాత్రి నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌రావు అందింది. వెంటనే ఆయన కోవూరు పోలీసులను అప్రమత్తం చేశారు. ఈలోపు ఏపీ39డీజే1000 నెంబరు గల తెలుపురంగు కారు వేగంగా లారీల మధ్యలో దూసుకెళ్లింది. ఈ విషయాన్ని పోలీసు అధికారులకు తెలియజేశారు.

● అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో..

వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద అర్ధరాత్రి రూరల్ డీఎస్పీ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. సరిగ్గా 1.30 గంటల ప్రాంతంలో కోవూరు పోలీసులు తెలిపిన నెంబరు గల కారు అక్కడకు రావడంతో ఆపారు. డ్రైవర్ పక్కగా నిలపగా తనిఖీ చేసేందుకు డీఎస్పీ వెళ్లారు. అంతే.. ఒక్కసారి కారు వాయువేగంతో ముందుకు దూసుకెళ్లింది. దీంతో డీఎస్పీ కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందజేసి, అప్రమత్తం చేశారు. తిరుపతి జిల్లా పోలీసులకూ సమాచారం ఇచ్చారు. గాయపడిన డీఎస్పీని నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



కల్వర్టును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లిన ఆత్మకూరు సీఐ వాహనం

● 3 గంటలు టెన్షన్.. టెన్షన్

వెంకటాచలం టోల్‌ప్లాజా నుంచి దూసుకెళ్లిన కారు తెల్లవారుజామున 4.20 గంటల వరకు అంటే 3 గంటల పాటు పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. వెంకటాచలం దాటిన తర్వాత బూదనం టోల్‌ప్లాజా వద్దకు కారు వస్తుందని తిరుపతి జిల్లా పోలీసులు అక్కడ కాపుకాశారు. అయితే అనూహ్యంగా గూడూరు పట్టణంలోకి వెళ్లి పాత బస్టాండు వద్ద విధుల్లో ఉన్న వాకాడు ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా, పోలీసుల పైకి దూసుకెళ్లింది. రెప్పపాటులో వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అక్కడ నుంచి పొదలకూరు మీదుగా చేజర్ల, కలువాయి, అప్పారావుపాలెం, ఆత్మకూరు మీదుగా కడప వెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు.

● పొలాల్లోకి వెళ్లి దొరికిపోయి..

జిల్లావ్యాప్తంగా అప్రమత్తమైన పోలీసులు ప్రతి కూడలిలో తనిఖీలు ముమ్మరం చేశారు. నెల్లూరు-ముంబయి రహదారిలోని మర్రిపాడు మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద కాపుకాశారు. టోల్‌ప్లాజా ముందున కోనసముద్రం గ్రామం వైపు తెల్లవారుజామున 4.20 గంటలకు తెలుపు రంగు కారు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మకూరు సీఐ గంగాధర్ తన సిబ్బందితో కారును వెంటాడారు. అయితే, కోనసముద్రం సమీపంలో మలుపు వద్ద కల్వర్టుపై సిమెంట్ దిమ్మెను సీఐ కారును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లింది. అయితే వెనుకే వస్తున్న మరో పోలీసు వాహనం కారును వెంటాడింది. కోనసముద్రం గ్రామం దాటాక పొలాలు మాత్రమే ఉండటంతో రోడ్డు లేక కారు అక్కడే ఆగిపోయింది. వెంటనే పోలీసులు కారుతోపాటు డ్రైవర్ సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ రాజమహేంద్రవరం సమీపంలోని రాజానగరం వాసిగా పోలీసులు గుర్తించారు.

● గంజాయి ఏమైంది!?

వెంకటాచలం వద్ద కారులో డ్రైవర్‌తోపాటు ముగ్గురు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అయితే, డ్రైవర్ మాత్రమే పట్టుబడటంతో మిగిలిన ఇద్దరు ఏమయ్యారని పోలీసులు ఆరా తీస్తున్నారు. అంతేగాక కారులో రవాణా చేస్తున్న గంజాయిని ఎక్కడ డంప్ చేసి ఉంటారని విచారిస్తున్నారు. ఏదిఏమైనా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు టెన్షన్ పెట్టిన కారు చివరకు దొరకడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు నిందితులు, దాచిన గంజాయిని వెలికితీసే పనిలో పడ్డారు.

- నెల్లూరు (క్రైం)/వెంకటాచలం/మర్రిపాడు

రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్

● ఓ కుటుంబంపై దాడి ● ఇద్దరికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 24: తిరుపతి పరిసర ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. తాజాగా ఓ బ్యాచ్ ఇంటిమీద దాడిచేసి ఇద్దరిని గాయపరిచింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటకు చెందిన టీడీపీ నేత చంద్రబాబు నాయుడు తన భార్య మల్లికతో కలిసి పది రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. మల్లంగుంట వినాయకనగర్‌కు చెందిన రౌడీషీటర్ కుల్లా అలియాస్ వెంకటేష్, తన అనుచరులు కొందరు ఉప్పరపల్లె చెక్‌పోస్టు వద్ద రోడ్డుకు అడ్డంగా కారు ఆపి మద్యం తాగుతున్నారు. కారు అడ్డం తొలగించమని వారిని చంద్రబాబు కోరారు. మద్యం మత్తులో ఉన్నవారు తిరస్కరించారు. చేసేదేమీలేక పక్క నుంచి వెళుతుండగా కారుతో ఢీకొట్టారు. ఆ ప్రమాదం నుంచి తప్పించుకుని ఎలాగోలా చంద్రబాబు దంపతులు ఇంటికి చేరుకున్నారు. వారం తర్వాత వెంకటేష్, అతడి అనుచరులు డిల్లీ, హరి, ఈశ్వర్‌తోపాటు మరి కొందరితో చంద్రబాబు ఇంటి ముందుకొచ్చి భారీ ఎత్తున టపాసులు కాలుస్తూ దుర్భాషలాడారు. ఈనేపథ్యంలో వారు మళ్లీ శుక్రవారం అర్ధరాత్రి చంద్రబాబు ఇంటికొచ్చి బయటకు రావాలంటూ కేకలేశారు. చంద్రబాబు, ఆయన భార్య మల్లిక, అమ్మ శాంతమ్మ ఇంటి తలుపుతీసి బయటికొచ్చారు. ఏంటని అడిగేలోపే.. ఖాళీ బీరు బాటిళ్లతో చంద్రబాబు, ఆయన భార్యపై దాడిచేశారు. చంద్రబాబు తీవ్రంగా గాయపడగా, మల్లికకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు శనివారం తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిని చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ షేక్ షావలి తెలిపారు. దాడి చేసిన కుల్లాపై ఇదివరకే రౌడీషీట్ ఉందని.. అతడితోపాటు అనుచరులను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.



తీవ్రంగా గాయపడ్డ చంద్రబాబు నాయుడు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మహిళలకు రక్షణ కల్పించాలి

సూళ్లూరుపేట,ఆగస్టు24:: మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టి వారికి రక్షణ కల్పించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకుడు లోకేష్ మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, ఎక్కడ చూసినా అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచారాలకు పాల్పడే వారిని కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు నరేంద్రం, అశ్వంత్, నిక్షిత్ పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

గూడూరు, ఆగస్టు 24: గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్య స్థాపనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన ఉమ్మడి నెల్లూరుజిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆలోచనలతో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి గ్రామసభలు విజయవంతంగా నిర్వహించి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారన్నారు. పవన్‌కళ్యాణ్ ఆశయం, ఆలోచనలను ప్రజాశ్రేయస్సు కోసం వినియోగిస్తూ ప్రజాసమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మోహన్, నాగార్జున, ఇమ్రాన్, సాయి, హరి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 24: నాయుడుపేట-నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి సమీపంలో స్కూటర్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో డిప్లొమా విద్యార్థులకు గాయాలు అయినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. శుక్రవారం రాత్రి సూళ్లూరుపేటకు చెందిన విద్యార్థులు గూడూరు నుంచి మోటారు సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యలో నరసారెడ్డికండ్రిగ సమీపంలోకి రాగానే ట్రాక్టర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వరుణ్, శ్రీధర్, సునీల్‌కు గాయాలయ్యాయి. 108 సిబ్బంది వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యసేవలకై నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవిందపల్లి ఉన్నత పాఠశాల ఎన్నిక మళ్లీ వాయిదా

కోట, ఆగస్టు 23 : కోట మండలం గోవిందపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఎన్నిక శనివారం కోరం లేక మళ్లీ వాయిదాపడింది. ఇక్కడి పాఠశాల విద్యాకమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి హైడ్రామా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఎంఈవో శైలజ, హెచ్‌ఎం గిరిబాబు పాఠశాలలో విద్యాకమిటీ ఎన్నికకు సంబంధించి 3వ సారి సమావేశం అయినా 50శాతం కూడా తల్లిదండ్రులు రాకపోవడంతో కోరం లేక విద్యాకమిటీ ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. అదేవిధంగా గోవిందపల్లి ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఇరువర్గాలకు చెందిన తల్లిదండ్రులు చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీడీపీ పటిష్ఠతకు కష్టపడి పనిచేయాలి

గూడూరు, ఆగస్టు 24: పార్టీ పటిష్ఠతకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో నాయకులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపనులను, సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్న పార్టీ సభ్యులకు నారా లోకేశ్ పంపిన ప్రశంసాపత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, నరసింహులు, సురేంద్ర, వేణు, మురళి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, నీటి వసతులపై దృష్టి పెట్టండి

వాకాడు, ఆగస్టు 24 : గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి వసతులపై దృష్టి పెట్టాలని ఎంపీపీ కొడవలూరు అనసూయమ్మ సూచించారు. శనివారం స్త్రీశక్తి భవనంలో మండల సమావేశం నిర్వహించారు. ఆమె ఆయా శాఖల అధికారుల పరిధిలో జరిగిన పురోగతిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలన్నారు. సమావేశానికి పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, నిర్మలమ్మ, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

ఒపన్ స్కూల్‌పై అవగాహన

దొరవారిసత్రం, ఆగస్టు 24 : ఓపన్ స్కూల్ విధానంతో మధ్యంతర చదువులను మళ్లీ కొనసాగించవచ్చని ఎంఈవో-2 కృష్ణయ్య తెలిపారు. శనివారం ఆయన మండల విద్యావనరుల కేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా వర్కర్లు, సీఆర్పీలకు ఒపన్ స్కూల్ విధానంపై అవగాహన కల్పించారు. పది, ఇంటర్మీడియట్ కోర్సులను మధ్యలో చదవ కుండా ఆపేసిన వారు ఒపన్ స్కూల్ విధానంలో పూర్తి చేసుకోవచ్చని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెళ్లకూరు, ఆగస్టు 24 : చెంబేడు గ్రామ సమస్యలను తీర్చాలని కూటమి నాయకులతో కలసి గ్రామస్తులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని కోరారు. వారు మాట్లాడుతూ 10 గ్రామాలకుపైగా సాగునీరు అందించే చెరువు కట్ట దెబ్బతిని బలహీనంగా మారిందని, వర్షాలు పడితే కట్ట తెగే ప్రమాదం ఉందని తెలిపారు. చెరువు కట్ట పటిష్ఠతకు పనులు చేపట్టేలా చూడాలని కోరారు. అలాగే చెంబేడుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, మండల జనసేన అధ్యక్షుడు మల్లాం విజయ్, నాయకుడు సుబ్బారెడ్డి, గిరియాదవ్, నాగార్జున, బషీర్‌షేక్ తదితరులు ఉన్నారు.

వెంకయ్య స్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు

సూళ్లూరుపేట, ఆగస్టు 24: మన్నారుపోలూరు వద్దనున్న భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం ఆరాధన ఉత్సవాలు నిర్వహించారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ వెంకస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


సర్పంచ్‌లకు తెలియకుండా అభివృద్ధి పనులా ?

చిట్టమూరు, ఆగస్టు 24: సర్పంచ్‌లకు తెలియకుండా పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం చిట్టమూరు స్త్రీ సంక్షేమ భవనంలో ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. టీడీపీ నాయకులు ఇసుక, గ్రావెల్, మట్టి మాఫియాగా మారారని కొందరు ఎంపీటీసీ సభ్యులు ప్రస్తావించారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను, వెలుగు కార్యాలయంలో వీవోఏలను తొలగించారని నిలదీశారు. ఇరిగేషన్, వెలుగు, ఆర్‌అండ్‌బీ, ఫారెస్టు, విద్యుత్ శాఖల అధికారులు సమావేశానికి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాలెడ్, జడ్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, తహసీల్దార్ ప్రసాద్, ఈవోపీఆర్‌డీ మనోహర్ గౌడ్ పాల్గొన్నారు.

'అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర హీనులవుతారు'

చిట్టమూరు, ఆగస్టు 24 : మండలంలో అభివృద్ధి పనులను వైసీపీ నాయకులు అడ్డుకుంటే చరిత్ర హీనులవుతారని టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ చిట్టమూరు మండల సమావేశంలో వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు టీడీపీపై చేసిన వాఖ్యలపై స్పందించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పొలాలకు, ఇంటి నివేశిత స్థలాలకు అధికారుల అనుమతి తీసుకొని మట్టి తోలుకుంటున్నారన్నారు. గ్రావెల్, ఇసుక, మట్టి మాఫియా అంటూ వైసీపీ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. ఆరూరు ఎంపీటీసీ ఆరూరు భార్గవి, నాయకులు హరికృష్ణారెడ్డి, సర్పంచ్‌లు నల్లారెడ్డి రాజేష్ రెడ్డి, కోటయ్య, కస్తూరయ్య, ఆరూరు గిరినాయుడు, కాపులూరు చెంచు రామయ్య, రషీద్, మణి, వెంకటరమణయ్య, అంకబాబు ఉన్నారు.

వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలి



మానవహారం చేస్తున్న విద్యార్థులు

సూళ్లూరుపేట, ఆగస్టు 24: కోల్‌కతాలో కామాంధుల చేతిలో బలైన వైద్యురాలు కుటుంబ సభ్యులను న్యాయం చేయాలని వీఎస్ ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం ర్యాలీ చేశారు. కళాశాలకు చెందిన మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో షార్ సర్కిల్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన చేసి మానవహారం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ మాట్లాడుతూ మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చి నిందితులను కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు ఉషారాణి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక వేడుకలు

సూళ్లూరుపేట,ఆగస్టు24:సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో సత్యజాంబవతి సమేత అలఘ మల్లారి కృష్ణస్వామి ఆలయంలో ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు అష్టబంధన మహా సంప్రోక్షణ వేడుకలు జరుగుతాయని ఆలయ ఇన్‌స్పెక్టర్ లోకేశ్వర రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను టీటీడీ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం అంకురార్పణంతో ప్రారంభమై నాలుగు రోజులపాటు ప్రత్యేక హోమాలు, పూజలు చేయనున్నారు. చివరి రోజు 28న కల్యాణోత్సవం, తిరువీధి ఉత్సవం, ధ్వజారోహణం జరుగుతాయన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

తడ, ఆగస్టు 24: తడ మండల పరిధిలోని మాంబట్టు సెజ్ సమీపంలోని అపాచి పరిశ్రమ వద్ద శనివారం పోలీసులు 11మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నారు. మండలంలోని కాదులూరుకు చెందిన పాల మునిశేఖర్ మోటారు సైకిల్‌లో మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు మాంబట్టు సెజ్ వద్దకెళ్లి నిందితుడ్ని అదుపులోకి తీసుకొని అతని వద్దనున్న 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండో పట్టణ సీఐగా శ్రీనివాస్



గూడూరు, ఆగస్టు 24: స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐగా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు వీఆర్ నుంచి బదిలీపై గూడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతామన్నారు. చట్టాలను అతిక్రమించినా, శాంతిభద్రతలకు విఘాతం కల్పించినా చట్టపరమైన చర్యలు చేపడుతామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలువురు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు అన్నదానం



గూడూరు, ఆగస్టు 24: స్థానిక ఐసీఎస్ రోడ్డులోని మైథిలి ఆసుపత్రి వద్ద శనివారం రత్నమ్మ నర్సింగ్ కళాశాల అధినేత రమణబాబు పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మైథిలి మాట్లాడుతూ పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సంతృప్తిని పొందుతామన్నారు.

14న లోక్ అదాలత్

వెంకటగిరి, ఆగస్టు 24 :వెంకటగిరిలో సెప్టెంబరు 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జి ఓ అనూష తెలిపారు. శనివారం వెంకటగిరిలో కోర్టులో న్యాయవాదులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్‌అదాలత్‌లో తమ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు.

ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు



నాయుడుపేట టౌన్, ఆగస్టు 24 : మండలంలోని కూచివాడ గ్రామంలో ఆక్రమిత భూమిలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. సర్వే నెంబరు 140 స్వర్ణముఖినది పోరంబోకు భూమిలో ఎవరూ ప్రవేశించరాదంటూ హెచ్చరిక బోర్డును శనివారం ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు గీతావాణి తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ కల్పించాలి

నాయుడుపేట, ఆగస్టు 24 : కరోనా సమయంలో నిలుపుదల చేసిన డెహ్రాడూన్, చెన్నై ఎక్స్‌ప్రెస్ రైళ్లను నాయుడుపేటలో పునరుద్ధరించాలని సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య, కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. ఆ మేరకు డీఆర్‌ఎం విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయుడుపేట సమీపాన మేనకూరు సెజ్ ఉండడంతో రైల్వేస్టేషన్‌ను అమృత్‌భారత్-2 ఫేస్ రైల్వేస్టేషన్‌గా రూపొందించాలన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

కోట, ఆగస్టు 23 : కోట క్రాస్ రోడ్డులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ శనివారం తెలిపారు. తిన్నెలపూడి స్వర్ణముఖినది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా బయట ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేటటౌన్, ఆగస్టు24: నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. ఈ నెల 21వ తేదీ ఆ వ్యక్తి నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో అపస్మారకస్థితిలో ఉండడంతో 108 సిబ్బంది నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 50 నుంచి60 ఏళ్లలోపు ఉంటుందని తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

వాకాడు, ఆగస్టు 24 : మండలంలోని నిడిగుర్తి పంచాయతీ బాలాజీనగర్ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మల్లావు నారయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రూ.10వేలు సాయం చేయగా ఆ మొత్తాన్ని టీడీపీ నాయకులు తీపలపూడి రమణయ్య, మల్లావు ప్రదీప్‌లు బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

పేద మహిళకు ఆర్థిక చేయూత

వాకాడు, ఆగస్టు 24 : బాలిరెడ్డిపాళెంలోని ఈదూరు సుజాత-వెంకటరమణయ్య కుటుంబానికి సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర కార్యదర్శి దామా విజయకుమార్ నిత్యావసర సరుకులను అందజేశారు. విజయకుమార్ మాట్లాడుతూ ప్రవాస భారతీయులైన వెంకటసాయికృష్ణ, మీన దంపతుల సౌజన్యంతో నిత్యావసరాలను అందజేశామన్నారు. దివి అనంతాచార్యులు, ఎఎన్‌ఎం కొండమ్మ, ఆశా మణెమ్మ పాల్గొన్నారు.

ఓజిలిలో తాగునీటి సౌకర్యం పునరుద్ధరణ

ఓజిలి, ఆగస్టు 24 : మండల కేంద్రం ఓజిలిలో బస్టాండు ప్రాంతంతోపాటు ప్రధాన వీధులలో ఏర్పడిన తాగునీటి సమస్యకు శనివారం అధికారులు పరిష్కారం చూపించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్‌ను పునరుద్ధరించి గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. కాగా ఇక్కడి చెరువు కట్టకు సమీపంలోని శివాలయం వద్ద నుంచి గ్రామంలోకి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ మరమ్మతులకు గురై నెల రోజులుగా ఈ ప్రాంతాల వాసులు తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఇటీవల పలు పర్యాయాలు గ్రామస్తులు మండల స్థాయి అధికారులకు తాగునీటి సమస్యపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన కూడా చేశారు. అప్పటికీ అధికారులు పరిష్కారం చూపకపోవడంతో శుక్రవారం జరిగిన గ్రామ సభలో తాగునీటి సమస్యను టీడీపీ నాయకులు లేవనెత్తారు. దీంతో వైసీపీ ఉపసర్పంచి, టీడీపీ నాయకుల మధ్య వాదోపవాదాలు జరిగి గ్రామసభ కూడా అర్థాంతరాంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో జిలాస్థాయి ఉన్నతాధికారులు ఈ పరిణామాలన్నింటిని సీరియస్‌గా తీసుకుని మరమ్మతులు చేపట్టి తాగునీటి సౌకర్యం పునరుద్ధరించాలని మండల అధికారులను ఆదేశించడంతో పనులు చకచకా జరిగిపోయి సమస్య పరిష్కారమైంది.



పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇస్తున్న సిబ్బంది

సోమశిల-స్వర్ణముఖి పైపులైన్‌పై అభ్యంతరాలు

అడ్డంకుల తొలగింపుపై తహసీల్దార్ దృష్టి

డక్కిలి, ఆగస్టు 24 : నాయుడుపేట, శ్రీసిటీలోని పరిశ్రమలకు తాగునీరు అందించేందుకు చేపట్టిన పైపులైన్ నిర్మాణంలో నెలకొన్న వివాదస్పద స్థలాలను శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు. మండలంలోని వెలికల్లు, మార్లగుంట, కందలవారిపల్లి గ్రామాల్లోని రోడ్డు మార్జిన్‌లో ఇళ్లు, గుళ్లు నిర్మించి ఉండటంతో ఆ ప్రాంతంలో పైపులైన్ నిర్మాణాన్ని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇంటిని తొలగిస్తే అందుకు తమకు నష్టపరిహారం ఇప్పించాలని బాధితులు తహసీల్దార్‌ను కోరారు. అంతేకాకుండా వెలికల్లు, ఆమర్లగుంట గ్రామాల వద్ద రోడ్డు మార్జిన్‌కు ఆనుకుని వున్న ఆలయం తొలిగిస్తే తమకు ప్రత్యామ్నాయంగా కొత్తగా వేరే ప్రాంతంలోనైనా ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు పట్టుబడుతున్నారు. ఇక్కడి పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించవద్దని గ్రామస్తులను కోరారు. ఈ వివాదాస్పద స్థలాలను పరిశీలించేందుకు ఈనెల 28వ తేదిన జిల్లా అదనపు కలెక్టర్లు డక్కిలికి వస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సొంత ఇంటిని కోల్పోతే వారికి నష్టపరిహారం అందించే విషయం ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్లు ఆయన వివరించారు.



వెలికల్లులో భూ వివాదాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

కోస్టల్ కారిడార్ భూ బాధితులకు పరిహారంపై గ్రామసభ



మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

చిల్లకూరు, ఆగస్టు 24: మండలంలోని తమ్మినపట్నం సచివాలయంలో శనివారం చెన్నై-బెంగుళూరు కోస్టల్ కారిడార్ భూముల సాగుదారులకు పరిహారం చెల్లింపుపై ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ, లింగవరం, పల్లివానిదిబ్బ, తీగపాళెం, తాళ్లబైట, గోనుగుంట గ్రామాల్లో కోస్టర్ కారిడార్‌కు కేటాయించిన 914 ఎకరాల భూముల్లో సర్వేచేసి సాగుదారుల జాబితాను గ్రామసభలో వెల్లడించామన్నారు. విస్తీర్ణంలో తేడా వచ్చిందని, పేర్లు మార్పు జరిగాయని, బీడుభూములుగా వచ్చాయని పలువురు సాగుదారులు అర్జీల రూపంలో అభ్యంతరాలను వ్యక్తం చేశారన్నారు. వాటిపై మళ్లీ ఈనెల 27వ తేదీ నుంచి సర్వే నిర్వహించనున్నామన్నారు. తహసీల్దారు శ్రీనివాసులు, ఏపీఐఐసీ జడ్‌ఎం చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ నందకుమార్, డిప్యూటీ తహసీల్దార్లు సురేంద్ర, విజయలక్ష్మి, సందీప్, నిరంజన్ పాల్గొన్నారు.

కోట : కోట మండలం కొత్తపట్నం సచివాలయంలో ఇండస్ట్రియల్ కారిడార్ భూములకు సంబంధించి శనివారం గ్రామసభ జరిగింది. ఇక్కడ పంచాయతీలోని మజరా గ్రామాల్లో ఉన్న 457.22 ఎకరాలలో ఎంజాయ్‌మెంట్ పరిధి సర్వే జరిగిన తరువాత అభ్యంతరాలపై గ్రామసభలు జరిగాయి. ఆర్డీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కొత్తపట్నం పంచాయతీలో ఉన్న భూములపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని రైతులను కోరగా అభ్యంతరాలను లిఖితపూర్వకంగా ఇచ్చారు. తహసీల్దారు జయజయరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, వీఆర్వోలు శ్రీనివాసులు, రమణయ్య, సుబ్రహ్మణ్యం, సర్వేయర్ రామ్‌కుమార్ ఉన్నారు.

టిప్పర్, బైక్ ఢీ

● ఒకరి మృతి ● ఇద్దరికి తీవ్ర గాయాలు



గోపాలయ్య (ఫైల్)

కోట, ఆగస్టు 24 : కోట మండలం కేశవరం, కొండుగుంట గ్రామాల సరిహద్దులో శనివారం తెల్లవారుజామున టిప్పర్, బైక్ ఢీకొన్న ఘటనలో కావలి గోపాలయ్య (55) మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు... వాకాడు మండలం నెలిపూడికి చెందిన గోపాలయ్య తన కుమార్తె నవ్యతో కలసి శుక్రవారం విజయవాడకు వెళ్లారు. అక్కడ ఆ అమ్మాయి మెడిసెన్ పూర్తి చేసుకొని ఉన్నందున అక్కడ కళాశాలలో సర్టిఫికెట్లు తీసుకొని తిరిగి రైల్లో అర్థరాత్రి దాటాక గూడూరుకు చేరుకున్నారు. అక్కడ నుంచి స్వగ్రామమైన నెలిపుడికి చేరుకునేందుకు ఎలాంటి వాహనాలు లేకపోవడంతో తన గ్రామంలోని సందీప్ అనే యువకుడిని బైక్ తీసుకొని గూడూరుకు రప్పించారు. అక్కడ నుంచి ఆ యువకుడితోపాటు తండ్రి, కూతురు బైక్‌లో గూడూరు నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. కేశవరం, కొండుగుంట సమీపంలో ఉన్న చెరువు దగ్గర వేగంగా వస్తున్న టిప్పర్ బైక్‌ను కొట్టి వెళ్లిపోయింది. రక్తపు మడుగులో గోపాలయ్య, ఆయన కుమార్తె పవిత్ర, సందీప్ కొట్టుమిట్టాడుతుండగా అటు వైపు వెళ్తున్న వాహనచోదకులు గుర్తించి 108 వాహనంలో గూడూరుకు తరలించగా గోపాలయ్య మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. సందీప్‌ని నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, పవిత్రను గూడూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు చేయిస్తున్నారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ పవన్ కుమార్ ఘటనాస్థలికి చేరుకొని గోపాలయ్య మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. బైక్‌ను ఢీకొట్టి వెళ్లిన టిప్పర్‌ను పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా కుమార్తె మెడిసిన్ చదువు పూర్తిచేసి సర్టిఫికెట్లు తీసుకొని తండ్రితో సంతోషంగా ఇంటికి వస్తున్న సమయంలో ఈ దుర్ఘటన జరగడం, కళ్లఎదుటే తండ్రి మృతి చెందటంతో వారి స్వగ్రామమైన వాకాడు మండలం నెలిపూడిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



మృతుడు రవిచంద్ర

ఓజిలి, ఆగస్టు 24 : ఓజిలి మండలం రాజుపాళెం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓజిలికి చెందిన గోనుపల్లి రవిచంద్ర (36) దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ రవిబాబు కథనం మేరకు ... ఓజిలి నుంచి రాజుపాళెంకు స్కూటీపై వెళ్ళిన అతడు పెట్రోలు పట్టుకునేందుకు రోడ్డు దాటుతుండగా రాంగ్‌రూట్‌లో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. రవిచంద్ర స్కూటీతోపాటు లారీ కిందకు వెళ్ళిపోయి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. లారీ డ్రైవరుగా కుటుంబాన్ని పోషించుకుంటున్న రవిచంద్ర మృతితో భార్యాపిల్లలు తల్లడిల్లిపోయారు. ఎస్‌ఐ రవిబాబు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అంతరిక్ష వారోత్సవాలు





సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, షార్ పూర్వ శాస్త్రవేత్త విశ్వనాథశర్మ తదితరులు, ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థినులు

గూడూరు అర్బన్, ఆగస్టు 24: స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అంతరిక్ష వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు అంతరిక్ష విశేషాల ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మన ఆలోచనలే విజయాలకు మెట్లుగా నిలుస్తాయన్నారు. చంద్రయాన్-3ని విజయవంతం ద్వారా మన దేశ కీర్తిప్రతిష్ఠలు ప్రపంచవ్యాప్తంగా వ్యాపించాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సమకాలిన విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి నాగసూరి, షార్ పూర్వ శాస్త్రవేత్త విశ్వనాథశర్మ, మాధవి, శాంతి, హనుమంతరావు, సురేష్, మెహబూబీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

గూడూరు, ఆగస్టు 24: పట్టణంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉట్టికొట్టి సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక పాండురంగస్వామి, గీతామందిరం ఆలయాల్లో శ్రీకృష్ణుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం పురవీధుల్లో గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు శోభయాత్ర జరిపారు. కార్యక్రమంలో శ్రీకంటి రామమోహన్‌రావు, మల్లికార్జున, మురళీరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, ఆర్‌వీరావు, సనత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో విద్యార్థులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలోని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించుకొన్నారు. సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా టైనీటాట్స్, ఐరిష్, ఛాంపియన్ తదితర పాఠశాల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు వేసి ప్రత్యేక పూజలు చేసి వేడుకగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఉట్టికొట్టించారు.